


నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

# గ్రేటర్ హైదరాబాద్

గురువారం 17 జులై 2025 పేజీలు 13


### నగరాన్ని క్లీన్, గ్రీన్ సిటీగా మార్చేందుకు

# ప్రతి పౌరుడు సహకరించాలి

## మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



హైదరాబాద్ మేజర్ న్యూస్ (సిటీ ప్రతినిధి): గ్రేటర్ హైదరాబాద్ నగరాన్ని క్లీన్, గ్రీన్ సిటీ గా తీర్చిదిద్దేందుకు నగరపాలక సంస్థ ప్రణాళికబద్ధంగా కృషి చేస్తుందని, ఇందుకు ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని మేయర్ గద్వాల విజయలక్ష్మి పిలుపునిచ్చారు. బుధవారం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనీ కూకట్ పల్లి జోన్ షిరిడి హిల్స్ కాలనీ లో మేయర్ గద్వాల విజయలక్ష్మి, కమిషనర్ ఆర్ వి కర్ణన్ వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. మొక్కల నీటి అవసరాలకు ఉద్దేశించిన బోరు మోటారు ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ గద్వాల విజయలక్ష్మి మాట్లాడుతూ.... గ్రేటర్ హైదరాబాద్ లో వన మహోత్సవం లో భాగంగా ఈ సంవత్సరం ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా భాగస్వామ్యంతో మిగతా 2లో

### వరద నీటి కాలువ నిర్మాణ పనులను

## పరిశీలించిన ఎమ్మెల్యే గాంధీ



మియాపూర్,మేజర్ న్యూస్ : వరద నీటి కాలువ పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే గాంధీ అధికారులకు సూచించారు.మియాపూర్ డివిజన్ పరిధిలోని గాయత్రి ఎన్క్లేవ్ కాలనీ నుంచి బొల్లారం మెయిన్ రోడ్డు వరకు రూ 1 కోటి 50 లక్షలతో నిర్మాణం చేపడుతున్న వరద నీటి కాలువ నిర్మాణ పనులను బుధవారం ఎమ్మెల్యే గాంధీ జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ అధికారులు, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ లతో కలిసి పరిశీలించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో వరద నీటి కాలువ నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలనీ అన్నారు.వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని వరద నీటి కాలువ నిర్మాణం పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.ప్రతి కాలనీలో అన్ని రకాల మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నాం అని, సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని, శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన, అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారబోయిన రాజు యాదవ్, ఎండి ఇబ్రహీం, మహమ్మద్ ఖాజా, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు

## ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనులను పరిశీలించిన మంత్రి కోమటిరెడ్డి



కాప్రా, మేజర్ న్యూస్: ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనులను బుధవారం రోడ్లు భవనాల శాఖ, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్ర మంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, అధికా రులు, బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## బోనాల వేడుకలు వైభవంగా నిర్వహించేలా జరుపుతాము

### భక్తులకు ఇబ్బంది కలిగిస్తే తీవ్ర చర్యలు : ఎమ్మెల్యే పద్మారావు గౌడ్



సీతాఫలమండి మేజర్ న్యూస్: చారిత్రాత్మక చిలకలగూడ కట్టమైసమ్మ దేవాలయంతో పాటు సికింద్రాబాద్ పరిధిలో ఆది, సోమవారాల్లో జరిగే బోనాలు వేడుకలు వైభవంగా నిర్విహించేలా అన్ని ఏర్పాట్లు జరుపుతున్నామని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటి స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ తెలిపారు. బోనాలు ఏర్పాట్లలో అధికారులు అలసత్వం వహించరాదని, భక్తులకు ఇబ్బంది కలిగిస్తే తీవ్ర చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. చిలకలగూడ కట్ట మైసమ్మ దేవాలయాన్ని పద్మారావు గౌడ్ బుధవారం సందర్శించి, బోనాలు ఏర్పాట్లను పరిశీలించారు. ఆలయం ప్రాంగణంలో వివిధ మిగతా 2లో

### నగరాన్ని క్లీన్, గ్రీన్ సిటీగా మార్చేందుకు

# ప్రతి పౌరుడు సహకరించాలి





**మొదటి పేజీ తరువాయి :**25 లక్షల మొక్కలను నాటడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ సీజన్ మొత్తం మొక్కలు నాటుతామని చెప్పారు.లక్ష్య సాధనకు నగరంలో ప్రతి ఇంటికి మొక్కలను పంపిణీ చేస్తామన్నారు. మొక్కలు నాటడం లో నగర పౌరులు క్రియాశీకల భాగస్వామ్యం కావాలన్నారు.ప్రతి ఒక్క పౌరుడు “ఏక్ ఫేడ్... మాకే నామ్” అనే నినాదంతో తమ తల్లి పేరుతో ఒక్కో మొక్క నాటాలన్నారు.మొక్కలను నాటడమే కాదు వాటి సంరక్షణ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు.మొక్కలు నాటడం వల్ల పిల్లలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందించినవారమవుతామన్నారు. ఆకుపచ్చని హైదరాబాద్ లక్ష్యంగా గ్రేటర్ పరిధిలో వనమహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు లికమిషనర్ ఆర్ వి కర్ణన్లి తెలిపారు. వార్డుల వారిగావనమహోత్సవం లక్ష్యాలను నిర్దేశించుకుని ప్రభుత్వ టార్గెట్ ను పూర్తి చేస్తామని అన్నారు. మొక్కల నాటడం పైనే కాకుండా వాటి సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు.కార్యక్రమంలో భాగస్వామ్యమైన విద్యార్థులు “ గో గ్రీన్” అంటూ నినాదాలు చేయగా వారితో కలిసి మేయర్, కమిషనర్ లు. ఫోటోలు దిగి అభినందించారు.కార్యక్రమంలో కూకట్ పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్, యు బి డి అదనపు కమిషనర్ సుభద్రా దేవి, కార్పొరేటర్ రావుల శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు..

## బోనాల వేడుకలు వైభవంగా నిర్వహించేలా జరుపుతాము

**మొదటి పేజీ తరువాయి :** ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆలయ చైర్మన్ గుంటి కృష్ణ, కార్యనిర్వహణా. దికారి మహేందర్ గౌడ్, జీ.హెచ్.ఎం.సీ. డిప్యూటీ కమీషనర్ ఆంజనేయులు, చిలకలగుడా ఇన్స్పెక్టర్ అనుదీప్, ట్రాన్స్కో, జలమండలి, బల్దియా, ట్రాఫిక్ అధికారులు కౌశిక్, కుశాల్, శ్రీకాంత్, వెంకటేశ్వర్ రావు, శ్రీనివాస్, బి.ఆర్.ఎస్. యువనేత తీగల్ల రామేశ్వర్ గౌడ్లతో పాటు అధికారులు, నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ.. జీ.హెచ్.ఎం.సీ ద్వారా రోడ్డు మరమ్మత్తులు, పరిశుభ్రతను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అదనపు సంఖ్యలో పోలీసు సిబ్బందిని నియమించాలని ప్రత్యేకంగా 30 సీ.సీ కెమెరాలను ఆలయం పరిసరాల్లో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మూడు రోజుల పాటు మంచి నీటి సరఫరా చేపట్టాలని జలమండ లి అధికారులకు సూచిం చారు. జాతర జరిగే చిలకలగూడ ప్రాంతంతో ప్రత్యేకంగా మంచినీటి ప్యాకెట్లను అందించాలని సూచించారు. పండుగల రోజుల్లో విద్యుత్ సరఫరాలో కోతలు లేకుండా జాగ్రత్తలు పాటించాలని ప్రత్యేకంగా మొబైల్ ట్రాన్స్ఫార్మర్ తో పాటు జనరేటర్లను సమకూర్చుకోవాలని ట్రాన్స్ కో అధికారులను ఆదేశించారు. చిలకలగుడా మున్సిపల్ మైదానాన్ని పార్కింగ్ కు వినియోగించాలని, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పండుగను ప్రజలు శాంతియుతంగా నిర్వహించుకుంటారని అధికార యంత్రాంగం నిర్వాహకులకు సహక రించాలని కోరారు. కట్ట మైసమ్మ ఆలయం వద్ద క్యూలైన్ల వద్ద భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు జరపాలని, సమీపంలోనే ఓ వైద్య శిబిరం ఏర్పాటు చే యాలని కోరారు. హక్కుదారుల గౌరవ బృతి పెంపు చిలకలగుడా కట్ట మైసమ్మ దేవాల యం హక్కుదారులకు చెల్లించే గౌరవ బృతి పెంచాలని హక్కుదారులు ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. వారికి రూ.10 వేల చోప్పున చెల్లించాలని అధికారులకు పద్మారావు గౌడ్ ఈ సందర్భంగా సూచించారు.

## ఫ్లైట్ ఏఐ171 క్రాష్ కాదు - విశ్వం నుండి వచ్చిన సంకేతం

### - సేవ్ ఎర్త్ మిషన్ ఇండియా చాప్టర్ అధ్యక్షుడు సందీప్ చౌదరి




అమీర్ పేట,మేజర్ న్యూస్:సేవ్ ఎర్త్ మిషన్ ఇండియా చాప్టర్ అధ్యక్షుడు సందీప్ చౌదరి గ్లోబల్ విజన్ అన్వీలింగ్ కార్యక్రమంలో ఇటీవలి ఎయిర్ ఇండియా ఫ్లైట్ ఏఐ171 క్రాష్ను మూడు నిమిషాల్లోపు వేదికపై ప్రత్యక్షంగా డీకోడ్ చేయడం ద్వారా ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను ఆకర్షించారని అంటున్నారు.వారి మాటలలో విమాన సంఖ్య,తేదీ మరియు ప్రమాదం జరిగిన సమయాన్ని, యాదృచ్ఛికంగా కనిపించే అంశాలతో అనుసంధానించే అతని విశ్లేషణ ప్రపంచవ్యాప్తంగా మీడియా దృష్టిని ఆకర్షించింది మరియు శాస్త్రవేత్తలు,ఆధ్యాత్మికవేత్తలు మరియు సాధారణ ప్రజలలో తీవ్ర చర్చకు దారితీసింది.ఇది గందరగోళం కాదు,ఇది కోడ్ అని చౌదరి అన్నారు.విశ్వం సంఖ్యలతో, ఫ్రీక్వెన్సీ,కంపనం మరియు శక్తితో మాట్లాడుతుందన్నారు.ఏఐ171 విషాదం కేవలం విమాన వైఫల్యం కాదు,విశ్వ అమరిక యొక్క క్షణం నేను సంఖ్యలను చూసిన వెంటనే దానిని డీకోడ్ చేసానన్నారు.సంఖ్యలు సమలేఖనం చేయబడినప్పుడు, అది యాదృచ్ఛికం కాదు, కానీ కమ్యూనికేషన్.ఇది కేవలం ఒక సాధారణ విమాన ప్రమాదం కాదు,కానీ విశ్వం నుండి వచ్చిన సంకేతం,గెలాక్సీల నుండి మన గ్రహానికి ఒక దైవిక సందేశం.ఇది ప్రతి మానవుడిని ఆత్మపరిశీలన చేసుకోవాలని,ప్రతిబింబించాలని,డీకోడ్ చేయాలని మరియు పరిణామం చెందాలని పిలుపునిస్తుందన్నారు.

## రాజేష్ లిబరేషన్ పార్టీ సభ్యుడు కాదు ...మూడేళ్ల క్రితం తొలగించాం

### - చందు నాయక్ హత్యను ఖండిస్తున్నాం - సిపిఐ (ఎంఎల్) బరేషన్ పత్రిక ప్రకటన

సోమాజిగూడ/మేజర్ న్యూస్: సిపిఐ నాయకుడు కామ్రేడ్ చందు నాయక్ హత్య ఘటనలో నిందితుడిగా ఉన్న దొంతి రాజేష్ తో తమకు ఎలాంటి సంబంధం లేదని, తమ పార్టీ సభ్యుడు కాదని సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ తెలంగాణ ఇన్చార్జి, కేంద్ర కమిటీ సభ్యులు నైనాలశెట్టి మూర్తి, రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్ రాజా స్పష్టం చేశారు. చందు నాయక్ ను లిబరేషన్ నేతలు కాల్పులు జరిపి హత్య చేశారని మీడియాలో కథనాలు రావడం పట్ల ఆ పార్టీ నాయకత్వం స్పందించింది. గతంలో లిబరేషన్ పార్టీలో కొంతకాలం రాజేష్ పని చేసిన మాట వాస్తవమే కానీ, సెటిల్మెంట్ దందాలు, ఇతర ఆరోపణల నేపథ్యంలో ఆయనపై మూడేళ్ల క్రితం క్రమశిక్షణ చర్యలు తీసుకున్నామని, ప్రస్తుతం దొంతి రాజేష్ ఎంఎల్ పిఐ రెడ్ ఫ్లాగ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగుతున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. చందు నాయక్ హత్య ఘటనను తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని, హత్య రాజకీయాలను ప్రోత్సహించబోదని వారు తెలిపారు. హత్య ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## అధునాతన క్యాన్సర్ పరిశోధనలో వి.జగన్మోహన్ రెడ్డికి పీహెచ్‌డి



హైదరాబాద్,మేజర్ న్యూస్ ప్రతినిధి : క్యాన్సర్ నిరోధక ఔషధ అభివృద్ధి రంగానికి గణనీయమైన సహకారాన్ని అందించిన, హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి వి. జగన్మోహన్ రెడ్డి డాక్టరేట్ కు అర్హత సాధించారు. ట్రయాజోల్ హైబ్రిడ్ నైట్రోజన్ హెటెరోసైక్లిక్ సమ్మేళనాల సంశ్లేషణ,జీవ మూల్యాంకనం పై అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శివకుమార్ కొప్పుల బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. క్లిక్ కెమిస్ట్రీ, రామాచారి ఆర్గ్ ఆక్సీ పద్ధతులను ఉపయోగించి డాక్టర్ జగన్మోహన్ రెడ్డి నూతన సల్ఫోనిల్-1,2,3- ట్రయాజోల్-పిరిమిడిన్ హైబ్రిడ్ లను సంశ్లేషణ చేసినట్టు తెలిపారు. ఈ సమ్మేళనాలు వివిధ మానవ క్యాన్సర్ కణ తంతు వులకు వ్యతిరేకంగా శక్తివంతమైన ఇన్ విట్రో సైటోటాక్సిసిటీని ప్రదర్శించాయన్నారు. హెల ,ఎంసీఎఫ్ - 7,ఏ-549 ఈజీఎఫ్ఆర్ నిరోధక పరీక్షలలో ప్రామాణిక ఔషధ ఎర్లోటినిబ్ ను అధిగమించినట్టు తెలిపారు. డాక్టర్ రెడ్డి అభివృద్ధి చేసిన ఉత్పన్నాలు రొమ్ము క్యాన్సర్ కణ తంతువు లు ఎమ్సిఎఫ్ -7, ఎండిఎ,ఎంబి-231 లకు వ్యతిరేకంగా ఆశాజనకమైన కార్యాచరణను చూపాయన్నారు. ఈజీ ఎఫ్ఆర్, ట్యూబులిన్ పాలిమరైజేషన్ వంటి కీలకమైన క్యాన్సర్ సంబంధిత మార్గాలను లక్ష్యంగా చేసుకోవడంలో ట్రయాజోల్-ఆధారిత స్కాఫోల్డ్ ల చికిత్సా సామర్థ్యాన్ని ఆయన పరిశోధన విశ్లేషించినట్టు తెలిపారు.డాక్టర్ జగన్మోహన్ రెడ్డి సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర గౌసియా బేగం, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు

## కో లివింగ్ హాస్టల్స్ విష సంస్కృతిని వెంటనే రద్దు చేయాలి

### డీజీపీకి వినతి ఇచ్చిన ఉద్యమకారులు



సోమాజిగూడ/మేజర్ న్యూస్: తెలంగాణ రాష్ట్రంలో యువతను వేధిస్తున్న కో లివింగ్ హాస్టల్స్ పై చర్యలు తీసుకోవాలని, అలాగే పెరిగిపోతున్న గన్ కల్చర్ ను కట్టడి చేయాలని డీజీపీ జితేందర్ ని తెలంగాణ మలిదశ ఉద్యమకారులు డిమాండ్ చేశారు. ఈ రోజు ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ నాయకత్వంలో ఒక ప్రతినిధి బృందం డీజీపీని కలసి వినతిపత్రం సమర్పించింది.ఈ సందర్భంగా ఓయూ జేఏసీ చైర్మన్ మరియు బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎనుగంటి రాజు నేత మాట్లాడుతూ, “హైదరాబాద్ నగర కేంద్రం నుంచి శివారు వరకు కో లివింగ్ హాస్టల్స్ పేరిట పాశ్చాత్య విష సంస్కృతిని పెంపొందిస్తూ, యువత జీవితాలను నాశనం చేస్తున్నారు. విద్యార్థులు, ఐటీ ఉద్యోగులు లక్ష్యంగా తీసుకొని మోసపూరితమైన ఆఫర్లతో యువతీ యువకులను ఆకర్షిస్తున్న ఈ హాస్టల్స్ లో గంజాయి, డ్రగ్స్ వాడకం పెరిగిపోయింది,” అని ఆవేదన వ్యక్తం చేశారు.అనుమతులు లేకుండా నడుస్తున్న ఈ హాస్టల్స్ గల్లీ గల్లీ పుట్టగొడుగుల్లా విస్తరిస్తుండటంతో, చట్ట విరుద్ధంగా నడుస్తున్న యాజమాన్యాలపై ప్రత్యేక బృందాల ద్వారా తనిఖీలు చేసి తగిన చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరారు. అంతేకాకుండా, అనుమతి లేని హాస్టల్స్‌ను వెంటనే మూసివేయాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.అలాగే ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా అక్రమంగా గన్స్ వాడకాలు, ఆయుధాల రవాణా పెరుగుతుండటంతో గన్ కల్చర్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని, అంతర్రాష్ట్ర ముఠాలపై నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకోవాలని వారు సూచించారు.ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు చెరుకు మణికంఠ, ఏకుల జగన్, ఇమ్మడి మహేష్, గద్దె మహేష్, సత్తూరి శ్రీశైలం, గోవింద్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్తంగా ఆకర్షించిన పికిల్‌బాల్ క్రీడ



అమీర్ పేట,మేజర్ న్యూస్:పికిల్‌బాల్ ఛాంపియన్‌షిప్ అట్టహాసంగా జరిగినాట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ టోర్నీకి 220 మందికి పైగా ఆటగాళ్లు,100 మందికి పైగా ప్రేక్షకులు హాజరయ్యారన్నారు.ఈ పోటీల్లో విజేతలుగా మెన్ డబుల్స్‌లో సమీర్, నిఖిల్ గెలుపొందగా,మెన్ సింగిల్స్‌లో రషీన్ శామ్యూల్ విజయం సాధించారన్నారు.వుమెన్ డబుల్స్‌లో రితిక, జోషిక గెలిచారన్నారు. వుమెన్ సింగిల్స్‌లో రితిక విజేతగా నిలువగా, రితిక,అనీష్ మిక్స్‌డ్ డబుల్స్‌లో గెలిచారు.అలాగే 35 ప్లస్ మెన్స్ డబుల్స్‌లో షెరింగ్,అవిలే విజేతలుగా నిలిచారు.ఈ ఛాంపియన్‌షిప్‌ను పికిల్‌అవుట్ నిర్వహించింది.పికిల్ అవుట్ అనేది భారతదేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న పికిల్‌బాల్ కమ్యూనిటీలలో ఒకటన్నారు.ఈ పోటీ తెలంగాణ నుంచే కాకుండా,బెంగళూరు,చెన్నై,కోయంబత్తూర్,విశాఖపట్నం నుంచి కూడా అగ్రశ్రేణి ఆటగాళ్లను ఆకర్షించిందన్నారు.పికిల్ అవుట్ ఇది కేవలం ఒక టోర్నమెంట్ మాత్రమే కాదు,ఇది అభివృద్ధి చెందుతున్న క్రీడా సమాజానికి,క్రీడల పోటీ స్ఫూర్తికి,కోర్టుకు క్రీడాకారులు తెచ్చే ఉత్సాహానికి సంబంధించిన ఒక వేడుక అని అన్నారు.

## అత్యంత వైభవంగా బోనాల జాతర ఉత్సవాలు



హిమాయత్ నగర్ , మేజర్ న్యూస్ :దూద్బౌల్లి లోని ఉందా బజార్ లోని శ్రీ పైనీరు ముత్యాలమ్మ దేవాలయంలో అత్యంత వైభవంగా బోనాల జాతర ఉత్సవాలను నిర్వహించనున్నామని ఆలయ కమిటీ చైర్మన్ డి ఆనంద్ గుప్తా తెలిపారు. బోనాల జాతర ఉత్సవాలను సంబంధించిన పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ ఆనంద్ గుప్తా మాట్లాడుతూ.. 21 26వ తేదీన అమ్మవారికి అభిషేకం పూజ 21వ తేదీన అమ్మవారి ఘటం ఊరేగింపు మందిరం నుంచి ప్రారంభమై ఢిల్లీ దర్వాజాకు చేరుకుంటుందని తెలిపారు ఈ కార్యక్రమంలో శ్రీ పైనీరు ముత్యాలమ్మ ఆలయ కమిటీ అధ్యక్షులు వెంకటాచలం ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి కట్టా నర్సింహారావు ఆలే, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సీనియర్ నాయకులు రాజేందర్ ముదిరాజ్, కమిటీ ప్రతినిధులు శ్రీనివాసచారి ,సంతోష్ గుప్తా, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రిగర్ పాయింట్" పుస్తకాన్ని కేంద్ర మంత్రి వి. సోమన్న ఆవిష్కరణ




హిమాయత్ నగర్, మేజర్ న్యూస్ : కేంద్ర రైలు మరియు జల శక్తి మంత్రిత్వ శాఖలో కేంద్ర రాష్ట్ర మంత్రి వి. సోమన్న ట్రిగర్ పాయింట్: ది షూటర్'స్ హ్యాండ్‌బుక్ పుస్తకాన్ని భారతీయ జనతా పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆవిష్కరణ చేశారు.డా. వంశీధర్ నాలి రచించిన ఈ పుస్తకం క్రీడా షూటింగ్, మానసిక ఏకాగ్రత మరియు అత్యుత్తమ ప్రదర్శనపై అనుభవప్రాయోగిక దృక్కోణాన్ని అందిస్తుంది. యువతలో నియమం మరియు క్రీడా సంస్కృతిని ప్రోత్సహించడంలో ఈ పుస్తకం పాత్రను మంత్రి ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో నాయకులు, క్రీడాకారులు మరియు అభిమానులు పాల్గొన్నారు.

## బీసీ లకు 42% రిజర్వేషన్లు అమలు చేయాల్సిందే

**- ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్**



హిమాయత్ నగర్, మేజర్ న్యూస్ : బీసీ లకు 42% రిజర్వేషన్లు అమలు చేస్తూ, హైకోర్టు ఆదేశాల మేరకు సెప్టెంబర్ 30లోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ కోరారు. హైదరాబాద్, లిబర్టీ, ఆప్ రాష్ట్ర కార్యాలయం నుండి విడుదల చేసిన ప్రకటనలో.. బీసీ ల రిజర్వేషన్ల అంశాన్ని తమ స్వార్థపూరిత రాజకీయ కోణంలో ఆలోచించకుండా బీసీలకు న్యాయం చేయాలన్న చిత్తశుద్ధితో ముందడుగు వేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డాక్టర్ దిడ్డి సుధాకర్ డిమాండ్ చేసారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ఆర్డినెన్స్ ముసాయిదా ను రాష్ట్ర గవర్నర్ ఆమోదించాలని, తదుపరి చట్టం తీసుకవచ్చి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలనీ చెప్పారు. బీసీలకు రాజకీయ, విద్య, ఉపాధి రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్రపతి వద్ద పెండింగ్ లోఉన్న బిల్లులను తక్షణమే ఆమోదం పొందేలా రాష్ట్రంలోని బీజేపీ కేంద్ర మంత్రులు, ఎంపీ లు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకరావాలని అయన డిమాండ్ చేసారు. తమిళనాడు తరహా బీసీ రిజర్వేషన్ల అంశాన్ని 9 వ షెడ్యూల్ లో చేర్చాలని అప్పుడే వారికీ న్యాయం జరుగుతుందని అన్నారు. రిజర్వేషన్లు అమలు చేయకుండా బీసీ లను అన్యాయం చేయాలనీ ప్రయత్నిస్తే తీవ్ర ప్రతిఘటన తప్పదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డాక్టర్ దిడ్డి సుధాకర్ హెచ్చరించారు.

## క్యూసీ ఇంజినీర్'..చేసే పని తక్కువ..జీహెచ్ఎంసీకి భారం

**'క్యూసీ ఇంజనీర్' ల పెత్తనాన్ని నియంత్రించాలి : కార్పొరేటర్ శ్రవణ్**



మల్కాజిగిరి, మేజర్ న్యూస్: జిహెచ్ ఎంసి లోని క్యూసీ ఇంజనీర్ ల పెత్తనాన్ని నియంత్రించాలని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ కోరారు. అధికారుల నిర్లక్ష్యంతో పాటు చెత్త విధానాలతో ప్రజానీకం తీవ్రంగా నష్ట పోతుం దని ఆయన ఆవేదన వెలిబుచ్చారు.ముఖ్యంగా ఇంజనీరింగ్ విభాగంలో కొత్త ప్రతిపాదనలకు క్యూసీ ఇన్స్పెక్షన్ తప్పని సరి చేయడంతో, ఈ పనుల కోసం కేటాయిం చిన క్యూసీ ఇంజనీర్లు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని కార్పొరేటర్ శ్రవణ్ విమర్శించారు. ఒక కొత్త ప్రతిపాదన సర్కిల్ కార్యాలయంలో పెట్టాలంటే క్యూసీ ఇంజనీరింగ్ వచ్చి చూసి రిపోర్ట్ ఇవ్వడానికే రోజుల తరబడి వేచి చూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు వారు ఎక్క డ ఉంటే అక్కడికి ఫైల్స్ పంపించి సంతకం తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.ఇటువంటి పనికి రాని వ్యవస్థతో ఎవరికీ లాభమని ఆయన ప్రశ్నించారు. 'క్యూసీ ఇంజనీర్లకు' జీహెచ్ఎంసీ పాలసీలపై పూర్తి అవగాహన ఉండటం లేదన్నారు. పనులు పూర్తయిన తర్వాత కూడా వీరికి ముడుపు లు చెల్లించాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఒక్కో ఇంజనీర్ వల్ల రూ 25 లక్షల నుండి 30 లక్షల వరకు జీహెచ్ఎంసీకి భారం పడు తోందని, కానీ వీరు చేసే పని చాలా తక్కువే అన్నారు. వెంటనే 'క్యూసీ ఇంజనీర్ల నియామకాలు రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ పనులకు డీఈ, ఎస్ఈ లను పూర్తి స్థాయి బాధ్యులను చేయాలని కార్పొరేటర్ శ్రవణ్ సూచించారు.

## న్యాయం చేయాలంటూ బాధితుడి నిరసన



జూబ్లీహిల్స్, మేజర్ న్యూస్: ఇంట్లో బంగారం తాకట్టు పెట్టి పనులు చేస్తే బిల్లులు ఇవ్వకుండా వేధిస్తున్నారంటూ ఓ బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఫిలింనగర్‌లోని దుర్గా భవానీనగర్ బస్తీకి చెందిన ఓర్సు ముత్యాలు బుధవారం జూబ్లీహిల్స్‌లోని ఫినిక్స్ సంస్థ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశాడు. తాము కొన్ని నెలల క్రితం ఫినిక్స్ సంస్థలో గతంలో డైరెక్టర్‌గా పని చేసిన సందీప్‌రెడ్డి అనే వ్యక్తికి చెందిన కన్ స్ట్రక్షన్ సైట్లలో పనులు చేయించుకొని లక్షలాది రూపాయల బిల్లులు పెండింగ్‌లో పెట్టాడని బిల్లులు చెల్లించాలని ఎన్నిమార్లు మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశాడు. సందీప్‌రెడ్డి తనతో పాటు పది మందికి పైగా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని, ఏం చేసుకుంటారో చేసుకోండి ఎవ్వరూ నన్నేమి చేయలేరని బెదిరిస్తున్నాడంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. బాధితులమంతా కలిసి కొన్ని రోజుల క్రితం ఫిలింనగర్ పోలీస్ స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశామని అయినా కూడా స్పందన లేదని, త్వరలోనే తామంతా కలిసి నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్‌ను కలిసి తమకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తామని తెలిపారు. పది మందికి పైగా కాంట్రాక్టర్లకు సదరు వ్యక్తం ' 2 కోట్లకు పైగా బిల్లులు బకాయి పెట్టాడని తామంతా చిన్న చితాక రెక్కాడితే డొక్కాడని కాంట్రాకర్లమని తెలిపారు. ఫినిక్స్ సంస్థ కార్యాలయానికి వెళ్తే తమకేమి తెలియదని చెబుతున్నారని తెలిపారు. తమ బిల్లులు తమకు రాకపోతే ఆత్మహత్య శరణ్యమని అన్నారు.

## జేఎన్టీయూలో మీడియా కథనంపై విద్యార్థుల ఆవేదన



ఖైరతాబాద్ మేజర్ న్యూస్ : జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం ప్రతిష్టను మసకబార్చేలా కథనాలు ప్రచురించడం సరికాదని, విద్యార్థుల భవిష్యత్‌కు భంగం కలిగేలా ఉంటుంది అని జేఎన్టీయూ విద్యార్థి సంఘాలు ఆవేదన వ్యక్తం చేశాయి. బుధవారం జేఎన్టీయూ ప్రాంగణంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరమ్ ఆధ్వర్యంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకుడు జవ్వాజి దిలీప్ మాట్లాడుతూ, “ఓ ప్రధాన మీడియా సంస్థ జేఎన్టీయూ ను అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా చూపడం బాధాకరం. ప్రతి సంవత్సరం సమాజానికి ఉపయోగపడే సాంకేతిక ఆవిష్కరణలు ఇక్కడి నుండి వస్తున్నాయి. అధ్యాపకులు లేరు అనే ఆరోపణలు ఆధారాలేమీ లేకుండా చేయడం సరికాదు. ప్రభుత్వ నిధులు ఆలస్యమవుతున్నందున అటానామస్ కళాశాలల నుండి సర్వీస్ ఫీజులు వసూలు చేయడం తప్పు కాదు,” అని తెలిపారు.

అదే విధంగా, వీసీ పదవీ వయసు 62 ఏళ్లు అని పేర్కొనడం అర్థరహితమని, ప్రొఫెసర్ల పదవీ వయసు 65 ఏళ్లని గుర్తుచేశారు. “గతంలో కూడా ఒకరిద్దరు వ్యక్తులు రెండు సార్లు వీసీగా పని చేశారు. కేవలం కట్టా నరసింహా రెడ్డి గారే రెండోసారి అయ్యారనడం తప్పుడు ప్రచారం,” అని మండిపడ్డారు. జేఎన్టీయూలో నిర్మించిన ఆరు అంతస్తుల భవనం ఉపయోగం లేకుండా ఉందని చెప్పడం సబబుకాదని అన్నారు. ట్రాన్స్ఫర్లు, డిప్యూటేషన్లు విద్యార్థుల భవిష్యత్తు, అధ్యాపకుల కుటుంబ పరిస్థితుల దృష్ట్యా జరుగుతున్నాయని తెలిపారు.”విశ్వవిద్యాలయంపై తప్పుడు ప్రచారం వల్ల మా డిగ్రీ విలువ మాయం అవుతుంది. సరైన ఆధారాలు ఉంటే బయటపెట్టి చర్యలు తీసుకోవచ్చు. కానీ నిరాధార ఆరోపణలు బాధ్యత రాహిత్యం,” అని దిలీప్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో విద్యార్థి నాయకులు కరుణాకర రెడ్డి, తేజ, అశోక్ గౌడ్, జగన్, భాను ప్రకాష్, రాహుల్ నాయక్, బ్రహ్మం, అరవింద్, సచిన్ తదితరులు పాల్గొన్నారు.

## జూలై 27న సైట్ 4,5 కాలనీ, పిజెఆర్ గ్రౌండ్స్‌లో మాగంటి గోపినాథ్ సంతాప సభ



జూబ్లీహిల్స్, మేజర్ న్యూస్: జూబ్లీహిల్స్ శాసనసభ్యులు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు స్వర్గీయ మాగంటి గోపినాథ్ సంతాప సభ జూలై 27న యూసఫ్ గూడా సైట్ 4,5 కాలనీ, పిజెఆర్ గ్రౌండ్స్ లో జరగనున్న సందర్భంగా, బోరబండ డివిజన్ నాయకులతో సన్నాహక సమావేశం యూసఫ్ గూడా క్యాంపు కార్యాలయంలో నిర్వహించబడింది. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేక్ గౌడ్ గారు మాట్లాడుతూ నాతో పాటు మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన గోపన్నగారు నాకు అత్యంత సన్నిహితులు. కుత్బుల్లాపూర్‌కి వచ్చిన మెజారిటీతో, జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ పార్టీని బలంగా నిలుపుతాం,” అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు వివేక్ గౌడ్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాగంటి సునీత గోపినాథ్, యూసఫ్ గూడా కార్పొరేటర్ రాజ్ కుమార్ పటేల్,బోరబండ డివిజన్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో కాప్రా డివిజన్ అభివృద్ధికి రూ.1 కోటి 33 లక్షలు మంజూరు

**మందుముల పరమేశ్వర్‌రెడ్డి, స్వర్ణరాజ్ శివమణి**



కాప్రా, మేజర్ న్యూస్:కాప్రా డివిజన్‌లో వివిధ అభివృద్ధి పనులను చేపట్టేందుకు రూ.1 కోటి 33 లక్షల నిధులను ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి మంజూరు చేశారని కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గంఇన్‌ఛార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి, కాప్రా కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి తెలిపారు. డివిజన్‌కు భారీగా నిధులను మంజూరు చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డికి వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ నిధులతో త్వరలోనే అభివృద్ధి పనులను చేపట్టనున్నామని వివరాలు వెల్లడించారు. కాప్రా డివిజన్‌లోని ఎల్లారెడ్డిగూడ శ్మశానవాటికలో అభివృద్ధి, సౌకర్యాల కల్పనకు రూ.84 లక్షల నిధులు మంజూరైనాయని చెప్పారు. ఈ నిధులతో స్మశాన వాటికలో సమస్యలు తీరిపోతాయన్నారు. అదే విధంగా డివిజన్‌లోని కృష్ణా నగర్,ఎల్లారెడ్డిగూడలలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సైతం మరో రూ.49.50 లక్షలు మంజూరు అయ్యాయని వారు తెలిపారు. ఈ సందర్భంగా నిధుల మంజూరుకు సంబంధించిన పత్రాలను ఆయా కాలనీల వాసులకు పరమేశ్వర్‌రెడ్డి, స్వర్ణరాజ్ అందచేశారు.

**సీఎం రేవంత్‌రెడ్డి చొరవతోనే నిధులు: పరమేశ్వర్‌రెడ్డి** .. ఉప్పల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు భారీగా నిధులను రాబట్టి పనులను చేపడుతున్నట్టుగా నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. అత్యధికంగా నిధులు రావడంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ ఉందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని నిధులను రాబట్టేందుకు కృషి చేయనున్నట్టుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, విఠల్ నాయక్,కాప్రా డివిజన్ అధ్యక్షులు కోబారి నాగశేషు, పూర్ణయాదవ్, మల్లా రెడ్డి, నాగరాజు, శ్రీధర్ రెడ్డి, సత్తి రెడ్డి, అల్లం మల్లేష్, రాకేష్ యాదవ్,అల్లం లక్ష్మణ్, తండా జ్ఞానేశ్వర్ గౌడ్, మాధురి ధోమధర్ రెడ్డి, వర్ల రామ్ రెడ్డి,కోరమ శ్రీశైలం,అల్లాడి కుమార్ యాదవ్, ధుబాల నర్సింగ్, కావలి బాలయ్య, అశోక్,ఎల్లారెడ్డి గూడ గ్రామ వాసులు,కృష్ణానగర్ కాలనీ సభ్యులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు

# ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం : జగదీశ్వర్ గౌడ్





హఫీజ్ పెట్,మేజర్ న్యూస్ : హఫీజ్ పెట్ డివిజన్ పరిధిలోని హుడా కాలనీ థీమ్ పార్కును డిప్యూటీ కమిషనర్ శశిరేఖ ,స్థానిక నాయకులతో కలసి పార్క్ అభివృద్ధి పనులను గ్రేటర్ హైదరాబాద్ స్టాండింగ్ కమిటీ సభ్యులు,శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి జగదీశ్వర్ గౌడ్ పరిశీలించారు.శేరిలింగంపల్లి నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తామని,అధికారుల సమన్వయంతో,పార్కులు,రోడ్లు, డ్రైనేజీలు,నీటి సరఫరా వంటి అభివృద్ధి పనులను వేగవంతం చేయడమే తమ కర్తవ్యమని,ప్రతి ఒక్క పౌరుడు మెరుగైన జీవన ప్రమాణాలను పొందేలా చర్యలు తీసుకుంటున్నామని,ప్రజలకు మంచి మౌలిక సదుపాయాలు కల్పించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం అని అన్నారు.ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం నాయకులు మిరియాల రాఘవరావు,కట్ల శేఖర్ రెడ్డి,మిరియాల ప్రీతం,శ్రీనివాస్,రాజేశ్వర గౌడ్,ప్రభాకర్,శంకర్, కిషోర్,మోసిన్, రవి,ప్రసాద్, హెల్త్ ఆఫీసర్ రవి,కిరణ్,శ్రీనువాస్,ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# పగలుసైతం రోడ్లమీద డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించిన నగర ట్రాఫిక్ పోలీసులు

సిటీబ్యూరో,మేజర్‌న్యూస్ః నగర పోలీస్ కమీషనర్ సి.వి.ఆనంద్ ఆదేశాలమేరకు నగర ట్రాఫిక్ జాయింట్ కమీషనర్ డేవీస్ జోయల్ పర్యవేక్షణలో బుధవారం జంట నగరంలోని పలు ప్రధాన ప్రాంతాల్లో ఇకనుంచి రాత్రి పూటయేగాక,పగలుసైతం రోడ్లమీద డ్రంక్ అండ్ డ్రైవ్ ను నిర్వహిస్తున్నట్లు నగర ట్రాఫిక్ జాయింట్ కమీషనర్ డేవీస్ జోయల్ తెలిపారు. ప్రజలు రోడ్డు ప్రమాదాలబారిన పడకుండ ఉండేందుకుగానుప్రజల భద్రతను పరిగణలోకి తీసుకుని వాహనాలను తనిఖీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ట్రాఫిక్ అధికారులు,పోలీసులు ఈ తనిఖీలమీద ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తుం దన్నారు. ఈ తనిఖీలో పలువురు ట్రాఫిక్ ఏ.సి.పి.లు, ఇన్‌స్పెక్టర్లు,ఎస్.ఐ.లు, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.



# శ్రీ కనకదుర్గా కాళీమాతా ఆలయంలో ఘనంగా శాకాంబరీ ఉత్సవాలు



మియాపూర్,మేజర్ న్యూస్ : మియాపూర్ బస్ డిపో వద్ద ఉన్న శ్రీ కనకదుర్గా కాళీమాతా ఆలయంలో బుధవారం శాకాంబరీ ఉత్సవాలు ఆలయ ప్రధాన అర్చకులు మాన్య సందీప్ మహారాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. శాకాంబరీ ఉత్సవాల్లో శ్రీ కనకదుర్గా కాళీమాతా అమ్మవారిని కూరగాయలు, ఆకు కూరలు, పండ్లతో అలంకరించి, శాకాంబరీ దేవిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అధ్యక్షులు బండారు వినయ్ రాజ్ ముదిరాజ్, బండారు మోహన్ ముదిరాజ్, జనరల్ సెక్రటరీ లు బి.ఎస్.ఎన్ సాయి యాదవ్, శ్రావణ్ నాయుడు ఉపాధ్యక్షులు గుండె దయానంద్ ముదిరాజ్ ఆధ్వర్యంలో అలంకరించి ఘనంగా శాకాంబరీ ఉత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మ వారిని దర్శించిన భక్తులకు కోరిన కోర్కెలు తీరుతాయని, గురువారం నాడు ఆలయంలో చండీ హెూమం నిర్వహిస్తారని కాగా భక్తులు అధిక సంఖ్యలో హజరై అమ్మ వారి కృపా కటాక్షముల కి పాత్రులు కాగలరని శ్రీ కనక దుర్గా కాళీ మాతా ఆలయ ప్రధాన అర్చకులు మాన్య సందీప్ మహరాజ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో బండారు మోహన్ ముదిరాజ్, బిజెపి మియాపూర్ డివిజన్ ప్రెసిడెంట్ ఆకుల లక్ష్మణ్ ముదిరాజ్, చందు, పట్టాభిరామ్, శ్రీకాంత్, సురేష్, వంశీ , నవీన్, సాయి, అనోక్, ఇంద్రనీల్, మనోజ్, నాని పంతులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బోనాల చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే గాంధీ



మియాపూర్,మేజర్ న్యూస్ : బోనాల పండుగను పురస్కరించుకుని తెలంగాణ ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం కింద శేరిలింగంపల్లి నియోజకవర్గం లోని 92 దేవాలయాలకు మంజూరైన రూ.30,61,000/- లక్షల రూపాయల చెక్కులను బుధవారం దేవాలయ కమిటీ ప్రతినిధులకు ఎమ్మెల్యే గాంధీ కార్పొరేటర్ ప్వలపాటి శ్రీకాంత్ తో కలిసి అందజేశారు.అనంతరం ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. బోనాల ఉత్సవాలను ప్రజలు ఘనంగా జరుపుకోవాలన్న ఆలోచనతో దేవాదాయ శాఖ పరిధిలో దేవాలయాలే కాకుండా ప్రైవేట్ దేవాలయాలకు కూడా తెలంగాణ ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని అందిస్తుందన్నారు. బోనాల పండుగ సందర్భంగా ఆలయాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టాలని అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, మహిళలు, దేవాలయాల కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రహమత్ నగర్‌లో డిప్యూటీ కమిషనర్ పర్యటన



రహమత్ నగర్.. మేజర్ న్యూస్.. జిహెచ్‌ఎంసి శాఖ సర్కిల్ 19 డిప్యూటీ కమిషనర్ రజినీకాంత్ రెడ్డి స్థానిక కార్పొరేటర్ సిఎన్ రెడ్డి తో కలిసి బుధవారం రహమత్ నగర్ డివిజన్లో పర్యటించారు. ఈ మేరకు రహమత్ నగర్ చౌరస్తా అభివృద్ధి అలాగే కార్మిక నగర్, ఎస్ పి ఆర్ హిల్స్ లో గల క్రీడా ప్రాంగణాన్ని, బ్రహ్మ శంకర్ నగర్ కమ్యూనిటీ హాల్ తో పాటు దళిత స్టడీ సెంటర్ ను వారు పరిశీలించారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో చేపట్టాల్సిన పనులు అలాగే ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడానికి పలు బస్తీలలో పర్యటించడం జరిగింది. నా దృష్టికి వచ్చిన సమస్యలను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి తర్వాత గతిన పరిష్కారం లభించే విధంగా చర్యలు తీసుకుంటానని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఏసిపి ప్రసిద్ధ గారు ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకట్ కిషన్ గారు %+నవీజ ణఎజుజు% భానుచందర్ గారు,ఇతర అధికారులు మరియు డివిజన్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను కలిసి సమస్యలను వివరించిన దళిత సంఘాల నేతలు.....



సిటీబ్యూరో,మేజర్‌న్యూస్ః తెలంగాణ ఏస్సీ,ఏస్టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను రాష్ట్ర మాదిగ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు మెట్టుపల్లి కొమురయ్య,అభ్యుదయ కళా రంజని వ్యవస్థాపక కార్యదర్శి మొకిరాల ఉద్రాసీన్‌లు మర్యాద పూర్వకంగాకల్సి ఘనంగా సత్కరించి, రాష్ట్రంలో ఏస్సీ,ఏస్టీలు ఏదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వారు వినతిపత్రంను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏస్సీ సంఘం నేతలుకూడ ప్రత్యేకంగా కల్సి చైర్మన్‌నుకల్సి అఅభినందించారు.

# ఎన్నికల హామీ ప్రకారం వికలాంగులకు పెంచిన పెన్షన్లు ఇవ్వాలి : పద్మశ్రీ మందకృష్ణ మాదిగ

▶▶ హామీలు అమలు చేయక పోతే సీఎం రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలి ▶▶ ఆగస్టు 13న ఎల్‌బి స్టేడియంలో జరగబోయే వికలాంగుల మహాగర్జన సభ జయప్రదం చేయండి





మల్కాజిగిరి, మేజర్ న్యూస్: వికలాంగులకు,పెన్షన్ దారులకు అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం పెంచిన పెన్షన్ అందించడంతో పాటు వారి సమస్యలను పరిష్కరించాలని ఎమ్మార్పీస్ వ్యవస్థాపక అధ్యక్షులు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆగస్ట్ 13న హైదరాబాదులో జరగనున్న వికలాం గులు, చేయూత పెన్షన్ దారుల మహాగర్జన సభ విజయవంతం కోసం బుధవారం నేరేడ్ మెట్ లో సన్నాహ సదస్సు నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ.. పెన్షన్ దారులకు ఇచ్చిన హామీని రేవంత్ సర్కారు వెంటనే అమలు చేయాలని, లేదంటే ఆయన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశా రు. ఎన్నికల ముందు పెన్షన్ పెంచుతామని కాంగ్రెస్ పార్టీ తర పున ఆయన హామీ ఇచ్చి, సీఎంగా 19 నెలలు గడుస్తున్న ఇచ్చి నా ఆ హామీని నిలబెట్టుకపోవడం శోచనీయమన్నారు. వికలాం గులకు రూ 6000, చేయూత పెన్షన్ 4వేలు, కండరాల క్షీణత వారికి పెన్షన్ రూ 15 వేలకు పెంచాలన్నారు. అర్హులైన ప్రతి వికలాంగునికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆరోగ్యశ్రీ పథకం, పెన్షన్ పెంపు, ఆరు కిలోల బియ్యం, ఇలా ఎన్నో పథకాలు ఎమ్మార్పీఎస్ చేసిన పోరాట ఫలితంగానే తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్నాయని ఆయన తెలిపారు. పేదల ప్రక్షపాతిగా వారి కష్టాలు తెలిసిన వాడిగా పేదల సమస్యలపై తాను పోరాడుతానని స్పష్టం చేశా రు. గతంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పోరాడి సాధించుకున్న పథకాలను సభలో వివరించారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఎమ్మార్పీఎస్ ముందుకు వెళ్తుందని ఆయన తెలి పారు.13 ఆగస్టు హైదరాబాద్ ఎల్ బి స్టేడియంలో జరగబోయే వికలాంగుల, చేయూత పెన్షన్ దారుల మహాగర్జన సభకు లక్ష లాదిగా కదలి రావాలని మందకృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కా జిగిరి జిల్లా వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు ఎన్.వినయ్,ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షులు కేశపాగ రామచందర్ మాదిగ, కళామండలి నాయకులు ఎన్. వై.అశోక్ మాదిగ, విహెచ్ పిఎస్ జిల్లా ఇన్ ఛార్జి నరసింహ, ఎంజెఎఫ్ రాష్ట్ర నాయకులు మనోహర్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ప్రణయ్ మాదిగ, బచ్చలకూర స్వామి,సిల్వేరి శ్రీను,కేశవ్ అంజి,యాదగిరి, సలోమి, పరశు రాం,బాలనరసింహలతో పాటు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలోని పెన్షన్ దారులు, వికలాంగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అట్టహాసంగా ఫ్రాంక్ ఆంథని మెమోరియల్ డిబేట్ పోటీ



శేరిలింగంపల్లి మేజర్ న్యూస్ : ఐసిఎస్ఈ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించబడే ప్రతిష్టాత్మకమైన ఫ్రాంక్ ఆంథనీ మెమోరియల్ ఇంటర్ స్కూల్ డిబేట్ పోటీ–2025 ఈసారి జాన్సన్ గ్రామర్ స్కూల్ ఐసిఎస్ఈలో ఘనంగా నిర్వహించారు. జంటనగరాలలోని 16 పాఠశాలల నుండి 50కి పైగా విద్యార్థులు పాల్గొని తమ తర్క, వాదప్రతివాద నైపుణ్యాలను ప్రదర్శించారు. 9వ, 10వ తరగతులకు చెందిన విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీలో "ఏఐ ఒక సాధనం కావచ్చు, కానీ అది విద్యా విధానం కాదు" అనే సమకాలీన అంశంపై బృందాలుగా చర్చ సాగింది. ఒక్క గంట సిద్ధకాలంతో విద్యార్థులు అనుకూలంగా, వ్యతిరేకంగా తమ అభిప్రాయాలను స్పష్టంగా చర్చించారు. ఈ సందర్భంగా జాన్సన్ గ్రామర్ స్కూల్, హబ్సిగూడ కు చెందిన బి. విశాల్ బందబావి, డి. శ్రీమాన్ యశ్వంత్ల బృందం ఉత్తమ బృందంగా నిలవగా, గీతాంజలి దేవ్‌శాలా, సికింద్రాబాద్ కు చెందిన నిరవ్ కల్వానీ, ఆదిత్ అమిన్లు రెండవ స్థానాన్ని దక్కించుకున్నారు. అలాగే ఉత్తమ వక్తగా డి. శ్రీమాన్ యశ్వంత్ ఎంపికయ్యారు.న్యాయనిర్ణేతలుగా డా. జయవంత్ రావు, డా. శ్రీధర్ మడ్డి, డా. సరస్వతి ప్రదీప్లతో కూడిన వారు గెలుపొందిన వారిని ప్రకటించారు . ఈ పోటీని డా. సంధ్యా బసవరాజు మోడరేట్ చేశారు. విద్యారంగంలో క్రియాశీలతకు, ఆలోచనా వికాసానికి ఈ పోటీలు ఎంతగానో దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు.

## ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్లు వేయాలని కోరుతూ 'డీవైఎఫ్ఐ' రౌండ్‌టేబుల్ సమావేశం



ముషీరాబాద్,మేజర్‌న్యూస్ ః భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలోరౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. పలు విద్యార్థియువజనసంఘాల నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వం వెంటనే ఉద్యోగకల్పనకు ముందుకు రావాలని డిమాండ్ చేసారు.కే.రమేశ్, వెంకటేశ్వర్లు,సలీం,సుమన్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రప్రభుత్వం సమగ్రమైన వివరాలతో జాబ్ క్యాలెండర్ ప్రకటించి అమలుచేయాలని డీవైఎఫ్ఐ డిమాండ్ చేసింది తక్షణమే ఉద్యోగాల భర్తీకై నోటిఫికేషన్లు విడుదల చేయాలని ఈ యువజన స మాఖ్య నేతలు కోరారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు క ల్పించేంతవరకు నిరుద్యోగభృతి రూ.4వేలు ఇవ్వాలని కోరారు. ఎలాంటి వివాదాలు, కోర్టు కేసులు లేకుండా పారదర్శకంగా నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేసారు.

## బోనాల కోసం రోడ్డు మరమ్మతు



ముషీరాబాద్ మేజర్ న్యూస్ : ముషీరాబాద్ నియోజకవర్గంలోని సాగర్ లాల్ నుండి రామాలయం వరకు రోడ్డు గుంతలు గుంతలుగా ఏర్పడడంతో వాహనదారులకు ఎటువంటి ఇబ్బంది కలక్కుండా, రాబోయే బోనాల పండుగ కు ఎటువంటి ఆటంకాలు కలగకూడదని తాత్కాలిక రోడ్డు మరమ్మత్తుల గురించి బస్తీ వాసులతో మాట్లాడి సంబంధిత అధికారులను ఆదేశించిన ముషీరాబాద్ శాసనసభ్యులు ముఠాగోపాల్ గారు, ముచ్చ కుర్తి ప్రభాకర్, వెంకటేశ్వర్లు, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రికి గంగిరెద్దుల కులస్తుల కృతజ్ఞతలు



హిమాయత్ నగర్, మేజర్ న్యూస్ : గంగిరెద్దుల సంచార కులం వారికి ఇండ్లు నిర్మించుకునేందుకు భూమిని కేటాయిస్తానన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలంగాణ రాష్ట్ర గంగిరెద్దుల సంచార కులం సంక్షేమ సంఘం నేతలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు బుధవారం బషీర్బాగ్ ప్రెస్ క్లబ్ లో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జల్లెల నరసింహ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆవుల ఎల్లయ్య లతో కలిసి గౌరవ అధ్యక్షుడు,, రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ భాగయ్య మీడియాతో మాట్లాడారు. ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని మంగళ్ పల్లి లో గంగిరెద్దుల సంచార కులం వారికి ఇంటి స్థలాలను కేటాయిస్తాననడం శుభ పరిణామం అన్నారు. మంగళవారం ముఖ్యమంత్రి స్వగృహంలో కలిసిన గంగిరెద్దుల పెంచార కులం వారి అభ్యర్థన మేర కు ఈ హామీ ఇవ్వడం జరిగిందని అన్నారు. వీరు ఉండేందుకు ఇండ్లు లేక సామాజికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. స్థిర నివాస అడ్రస్ లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు, మహిళలకు రుణాలు అందక పేదరికంలో మగ్గిపోతున్నట్లు ఆవేదన చెందారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి, తన హామీ మేరకు ఇంటి స్థలాలను వెంటనే కేటాయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో నరసమ్మ ,వెంకటమ్మ, అంజమ్మ, లక్ష్మయ్య ,రామస్వామి, నరసింహ, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## చర్లపల్లి డివిజన్ అభివృద్ధిపై సమీక్షా సమావేశం



కాప్రా, మేజర్ న్యూస్:చర్లపల్లి డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పరిష్క రించాలని జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె, జీహెచ్ ఎంసీ డీఈ బాలకృష్ణతో కలిసి సమీక్షా సమావేశం నిర్వ హించారు.

## బీసీ రిజర్వేషన్లు చారిత్రాత్మకం - నేవూరి వెంకట్‌రెడ్డి



జూబ్లీహిల్స్, మేజర్ న్యూస్: స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు జారీ చేయనున్న ఆర్డినెన్స్ చరిత్రలో నిలిచిపోనుందని సిరిసిల్లా జిల్లా కాంగ్రెస్ నేత నేవూరి వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఎమ్మెల్యే కాలనీలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి ఎంత మంచి పని చేసినా కూడా ప్రతిపక్ష పార్టీల నేతలు ధర్నాలు, నిరసనల పేరుతో చేస్తున్న డ్రామాలు ఇకనైనా ఆపాలని సిరిసిల్లా జిల్లా కాంగ్రెస్ నేత నేవూరి వెంకట్‌రెడ్డి అన్నారు. గతంలో ఎన్నో ప్రభుత్వాలు మారినప్పటికీ బీసీల జనాభా ఎంతో తేల్చలేదని సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ చొరవతో బీసీ కుల గణన పూర్తి చేశారని రాహుల్ గాంధీ ఆదేశాలతో చేసిన ఈ కుల గణన పూర్తి కావడంతో తెలంగాణ మోడల్ వైపు దేశం మొత్తం చూస్తోందని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు చేయడంతో బీసీలు మొత్తం కాంగ్రెస్ ప్రభుత్వానికి రుణపడి ఉంటారని రాజకీయంగా వారికి మంచి అవకాశాలు లభించినట్లు అవుతుందని అన్నారు. ప్రతిపక్ష పార్టీలు తప్పుడు ప్రచారాలు మానుకోవాలని పదేళ్ళు అధికారలలోకి ఉండి ఏం చేయలేదని బీఆర్‌ఎస్ పార్టీ నేతలు ఇప్పుడు ధర్నాలు, నిరసనల పేరుతో కొత్త డ్రామాకు తెరతీస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు ఎంతో మంచి పథకాలు అందుతున్నాయని, ఉచిత కరెంటు, రైతు భరోసా, మహాలక్ష్మి పథకం, సబ్సిడీ గ్యాస్, సన్న బియ్యం పథకాలను పేదలు ఎంతో ఆదరిస్తున్నారని అన్నారు.

## మొక్కలు నాటుదాం పర్యావరణాన్ని కాపాడుకుందాం –కార్పొరేటర్ కంది శైలజ శ్రీకాంత్



సీతాఫలమండి మేజర్ న్యూస్: మొక్కలు నాటుదాం పర్యావరణాన్ని కాపాడుకుందామని బౌద్ధనగర్ డివిజన్ కార్పొరేటర్ కంది శైలజ శ్రీకాంత్ అన్నారు. బుధవారం లలితనగర్ పార్క్‌లో ఏర్పాటు చేసిన వనమహోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రకృతిని కాపాడి, భవిష్యత్తును సురక్షితంగా ఉంచుదాం. అదే విధంగా పర్యావరణం లేనిదే మనం లేము, మన అభివృద్ధి లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు రాజేష్, పాకసాయి, కృష్ణకుమారి, భూలక్ష్మి, హార్టికల్చర్ మేనేజర్ మహేశ్వరి, సూపర్వైజర్ ప్రవీణ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం బీసీ కులాల మధ్య గొడవ పెట్టడం సరికాదు

## -సామాజిక విశ్లేషకుడు అల్లాదుర్గం సురేష్



హైదరాబాద్, మేజర్ న్యూస్: బీసీలకు కల్పించే రిజర్వేషన్ల నుంచి ముస్లింలను తొలగిస్తే తెలంగాణ రాష్ట్రంలోని బీసీ కులాలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి కేంద్రాన్ని ఒప్పించే బాధ్యత తీసుకుంటానని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చెప్పడం ఆశ్చర్యానికి గురిచేస్తుందని సామాజిక విశ్లేషకుడు అల్లాదుర్గం సురేష్ అన్నారు.ఈ విషయమై ఆయన బుధవారం స్పందిస్తూ కేంద్ర ప్రభుత్వం అమలు చేసే 10 శాతం ఈడబ్ల్యూ ఎస్ రిజర్వేషన్లలో "అగ్రకుల ముస్లింలు(షేక్, సయ్యద్, రిజ్వి) మాత్రమే" అర్హులన్న సంగతి బండి సంజయ్ కు తెలవకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అగ్రకుల ముస్లింలకు రిజర్వేషన్లు ఇవ్వగా లేనిది బిసి ముస్లిం కులాలకు రిజర్వేషన్లు ఎందుకు ఇవ్వరాదని అంటున్నారో ఆయన సమాధానం చెప్పాలన్నారు.గుజరాత్ లోని బిజెపి ప్రభుత్వం అక్కడి ముస్లింలకు రిజర్వేషన్లు కల్పిస్తున్న సంగతి అందరికీ తెలిసిందేనని పేర్కొన్నారు.బండి సంజయ్ కు నిజంగా కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించే సత్తా లేదా అని ప్రశ్నించారు.ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించ కూడదు అనే భావన ఉంటే మొదట కేంద్ర ప్రభుత్వం అమలు చేసే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ నుంచి ముస్లిం కులాలను తొలగిస్తూ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు.కేంద్ర మంత్రి హోదాలో ఉండి తెలంగాణ రాష్ట్రంలోని బీసీ కులాలకు,ముస్లింలకు మధ్య గొడవ పెట్టే విధంగా బాధ్యతారాహిత్యంగా మాట్లాడడం సరికాదన్నారు.బాబాసాహెబ్ అంబేద్కర్ భారత రాజ్యాంగం ద్వారా ఎస్సీ, ఎస్టీ కులాలకు "మేమెంతో మాకంతా" అంటూ విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో రిజర్వేషన్లు తెచ్చుకున్నారు కాబట్టి నేడు ఆయా కులాల వారు సమాజంలో తగిన గౌరవం పొందుతున్నారన్నది వాస్తవం అన్నారు.రెండు శాతం జనాభా లేని అగ్రవర్ణ పేదలకు దేశవ్యాప్తంగా 10 శాతం రిజర్వేషన్ లు కల్పించడానికి కేవలం "పది రోజుల వ్యవధిలో" పార్లమెంటులోని ఉభయసభల్లోనూ, రాష్ట్రపతి తోను ఆమోదింపజేసి చట్టం రూపొందించడంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సఫలీకృతమైందన్నారు.సుప్రీంకోర్టు ఇందిరా సహాని వర్సెస్ యూనియన్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా 1992 కేసులో ఇచ్చిన తీర్పు ఆధారంగా ఎస్సీ,ఎస్టీ,బీసీల రిజర్వేషన్లు కలిపి 50 శాతం దాటవద్దు అనే నిబంధనను కేంద్ర ప్రభుత్వం తొలగించే ప్రయత్నం చేయకపోవడం దేశంలోని యావత్తు బీసీలకు అన్యాయం చేసినట్లే కదా అన్నారు.దేశంలోని అన్ని రాష్ట్రాల్లో అమలు చేస్తున్న బీసీల రిజర్వేషన్లు అసమానతలు పెంచే విధంగా ఉన్నాయని అనటంలో అతిశయోక్తి లేదన్నారు.గత 15 సంవత్సరాలుగా కేంద్రంలో అధికారంలో ఉండి హిందుత్వ పార్టీగా పేరు తెచ్చుకుంటున్న బిజెపి ప్రభుత్వం బీసీ కులాల రిజర్వేషన్లను ఎందుకు సరి చేయలేక పోతుంది అనేది ప్రశ్నార్థకంగా మారిందన్నారు.అనంతరామన్ కమిటీ రిపోర్ట్ 1972 ఆధారంగా రూపొందించిన బీసీ కులాల రిజర్వేషన్లను సమీక్షించే క్రమంలో ఏర్పాటు చేసిన మురళీధర్ రావు కమిటీ 1982 తన రిపోర్టులో బీసీ కులాలకు (ముస్లింలు కాకుండా) 44 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని చెప్పడం జరిగిందన్నారు.మురళీధర్ రావు కమిటీ రిపోర్ట్ ఆధారంగానే ఆనాటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ప్రభుత్వం ఎస్.ఆర్.శంకరన్ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్నప్పుడు జీవో ఎంఎస్ నెంబర్ 166, తేదీ 15.07.1986 ద్వారా బీసీ కులాలకు 44 శాతం రిజర్వేషన్ కల్పించే ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని గుర్తు చేశారు. బీసీ కులాలకు 44 శాతం రిజర్వేషన్లు కల్పించే జీవోను సవాలు చేస్తూ వేసిన పిటిషన్ను మూడు నెలల కాలంలో విచారించి తేదీ 05.09.1986 న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కొట్టివేయడం జరిగిందని పేర్కొన్నారు.1986లోనే బీసీ కులాలకు 44 శాతం రిజర్వేషన్లు ఇవ్వగా లేనిది ప్రస్తుతం ముస్లిం కులాలను కలుపుకొని 42 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి ప్రభుత్వాలకు కలిగే ఇబ్బంది ఏమిటో అర్థం కావడం లేదన్నారు.నాయకులు సున్నితమైన అంశాల పట్ల జాగ్రత్తగా మాట్లాడాలని, ప్రస్తుత రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలోని ముస్లింలు, బీసీ కులాలకు 42 శాతం రిజర్వేషన్లను కచ్చితంగా అమలు చేసి తీరాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారన్నారు

## అమ్మవారికి మగ్గం పట్టు చీర ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ అధికారులు, స్థానిక కార్పొరేటర్, ఆలయ ముఖ్యులు పవన్ కుమార్ గౌడ్



సీతాఫలమండి, మేజర్ న్యూస్: మధురానగర్ కాలనీలోని శ్రీ బంగారు మైసమ్మ అమ్మవారి దేవాలయంలో ఈ నెల 20న జరిగే బోనాల జాతర ను పురస్కరించుకొని అమ్మవారికి మరమ్మగ్గంపై నేత కార్మికులు రూపొందించే పట్టు చీర నేసే కార్యక్రమం అమ్మవారి ఆలయంలో బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గుర్రం పవన్ కుమార్ గౌడ్, చిలకలగూడా డివిజన్ ఏసీపీ శశాంక్ రెడ్డి, వారాసిగూడ ఎస్హెచ్ఓ మధుసూదన్ రెడ్డి, ఎస్సై ఆంజనేయులు గౌడ్, కార్పొరేటర్ శ్యామల హేమలు ప్రారంభించారు. ఈ పట్టు చీరను చంద్రకాంత్ లక్ష్మి దంపతులు అమ్మవారికి బహుకరించడం జరుగుతుంది. కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు జయరాజ్, శ్రీధర్, శ్రీనివాస్, కృష్ణ మూర్తి, కాలనీ సభ్యులు ధనశేఖర్, శ్రీకాంత్ రెడ్డి, మహేష్ నాయుడు, జెమిని రాజు, బీఆర్ఎస్ నాయకులు బాబు రావు, శైలందర్, అశోక్ చారి, ఎల్లయ్య గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# అయ్యా!...మీకిది భావ్యమా

### కొమ్మలు నరికేసి రోడ్డున పడేసి వెళితే తొలగించేదెపుడు?...అసలు ఎవరు తొలగించాలి??...ఆ బాధ్యత మీది కాదా??? జరా సోచో సాబ్!



వెంగళరావునగర్, మేజర్న్యూస్: వీధుల్లో ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలను తగులేటట్లుంటే వాటిని సాధారణంగా ఆ శాఖ సిబ్బంది వాటిని తొలగిస్తుండడం మనం చూస్తూనే ఉంటాం. అది అవసరం కూడా. అయితే అసలు సమస్యేంటంటారా...ఆ విధంగా తొలగించిన చెట్ల కొమ్మలను పడేసిన చోటు నుండి ఎవరు తొలగించాలి అనేదే అసలు ప్రశ్న. అవి గుట్టలుగా పేరుకుపోయి, వారాలు, ఒక్కోసారి నెలల తరబడి అలాగే పడి ఉంటే ఇక కొత్త సమస్యలు ఉత్పన్నం కావా... ఇదే తరహాలో వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని మధురానగర్ కాలనీలో సుమారు నెల రోజుల క్రితం పలు వీధుల్లో విద్యుత్ శాఖ అధికారులు కాంట్రాక్టు సిబ్బందితో చెట్ల కొమ్మలను నరికి వేయించారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా, అలా నరికేసిన కొమ్మలను ఆయా వీధుల్లో అలాగే వదిలేసి వారు చేతులు దులిపేసుకున్నారు. ఇదే విషయాన్ని కాలనీ సంక్షేమ సమితి వారు, కాలనీ వాసులు కలిసి సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఊహుఁ...ఫలితం శూన్యం. సరేలే, ఈరోజు కాకపోయినా రేపయినా తొలగిస్తారేమో అని ఎదురు చూసిన కాలనీ వారికి నిరాశే మిగిలింది. చివరికి సంబంధిత ఓ అధికారి మాత్రం కాంట్రాక్టరుతో మాట్లాడుకోండని సలహా ఇచ్చి తన మానాన తానున్నాడు. ఇక కాంట్రాక్టరుకు ఫోన్ చేస్తే తమకిచ్చే డబ్బులతో చెట్ల కొమ్మలు నరకడమే ఎక్కువ, ఇక వాటిని తొలగించడం కూడానా అని సమాధానం వస్తోందని బాధితులు వాపోతున్నారు. మరోవైపు రోడ్లపై పేరుకుపోయిన కొమ్మలు ఎండిపోయి, ఆకులు రాలిపోయి, చెత్తా చెదారంగా మారిపోవడంతో ఇక చేసేదిలేక కాలనీ సంక్షేమ సమితి వారే నెలరోజులుగా వీధుల్లో ఉండిపోయిన కొమ్మలను తమ అసోసియేషన్ సిబ్బందితో బుధవారం తొలగింపజేసినట్లు కాలనీ ప్రధాన కార్యదర్శి కోడే సాంబశివరావు పేర్కొన్నారు. బుధవారం హెచ్-100, హెచ్-42, డి-8, బి-107, బి-100, బి-86, బి-88, బి-77, బి-68, ఇంకా బి-15 ఇండ్ల ముందు ఉండిపోయిన (ఎండిపోయిన) కొమ్మలను సిబ్బందితో స్వయంగా డీసీఎం పెట్టి తొలగింపజేశారు. ఈ సమస్య ఒక్కరోజుది కాదని, ఈ విధంగా కొమ్మలు నరికేసి పడేసిన ప్రతిసారీ ఉత్పన్నమవుతోందని, వాస్తవానికి వీటిని నరికేసిన వారే తొలగించాల్సిన బాధ్యత వారికి లేదా అని కాలనీ వాసులు ప్రశ్నిస్తున్నారు. దీనికి సంబంధిత అధికారులు సమాధానం చెప్పాలని, ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించడం మాత్రం సబబు కాదని వారంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు ఈ విషయంలో చొరవ తీసుకుని ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులను తొలగించాలని కాలనీ వాసులు, సంక్షేమ సమితి వారు కోరుతున్నారు.

## పేదల వైద్య సేవలకు సహకారం -పద్మారావు గౌడ్



సీతాఫలమండి, మేజర్ న్యూస్: సికింద్రాబాద్‌లోని మైలార్‌గడ్డ ప్రాంతానికి చెందిన భగ్గు హరీష్ అనారోగ్యంతో సతమతమవుతున్న దశలో సమాచారం అందుకున్న స్థానిక శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ ఆయన వైద్య ఖర్చుల నిమిత్తం రూ.2 లక్షల మేరకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి లెటర్ ఆఫ్ క్రెడిట్ పత్రాన్ని సీతాఫలమండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం అందించారు. బీఆర్ఎస్ నేత రామేశ్వర్ గౌడ్, ఇతర నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పద్మారావు గౌడ్ నిరుపేదలకు నాణ్యమైన వైద్యం భారంగా మారిన దశలో వైద్య సేవలను పొందేందుకు తమ వంతు సహకారాన్ని అందిస్తున్నామని అన్నారు. ప్రజలు అత్యవసర సందర్భాల్లో సీతాఫలమండిలోని తమ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

## టీఎస్ ఆర్టీసీ బహుజన వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక



ముషీరాబాద్,మేజర్న్యూస్ : తెలంగాణ రాష్ట్రం ఆర్టీసీ బహుజన వర్కర్స్ యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కదిరె కృష్ణ(గౌరవ అధ్యక్షులు), జే.సత్యనారాయణగౌడ్(ముఖ్యసలహాదారులు), జీవీకే యాదవ్(రాష్ట్ర అధ్యక్షులు), బి.బయన్న(ఉపాధ్యక్షులు), ఏ.శ్రీనివాస్,డీ.యాదయ్య (వర్కింగ్ ప్రెసిడెంట్), సుద్దాల సురేష్(రాష్ట్రప్రధానకార్యదర్శి),గౌడరవికిరణ్(అడిషినల్ జనరల్ సెక్రటరీ), ఎండీఅసలం(డిప్యూటీ సెక్రటరీ),నర్సింలు(జాయింట్ సెక్రటరీ), రామచంద్ర(ఆర్గనైజింగ్ సెక్రటరీ),బి.శ్రీవివా స్గౌడ్(కో శాధికారి) ,పి.రామ చంద్ర(ప్రచారకార్యదర్శి), బి.నగేశ్,ఎల్.మల్లేశ్(కార్యవర్గసభ్యులు) ,గండమల్ల సురేఖ, బ.లక్ష్మి,ఎం.సుజాత(రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు)-నూతనకమిటీ బాధ్యతలను స్వీకరించింది. ఆర్టీసీని ప్రైవేటీకరణచేసేందుకు గత ప్రభుత్వం తీసుకున్న విధానాలను కాంగ్రెస్ప్రభుత్వం కొనసాగిస్తుందని నూతన కమిటీ నేతలు పేర్కొన్నారు. 40వేల మంది ఆర్టీసీ కార్మికులపై ఈ విధానాలు ప్రభావం చూపుతున్నాయన్నారు. ఆర్టీసీలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి వెంటనే నోటిఫికేషన్ వేయాలని ప్రభుత్వాన్ని వారు కోరారు

## ఘనంగా చారిత్రాత్మక ఉజ్జయినీ మహంకాళి జాతర





చందానగర్ మేజర్ న్యూస్ : సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి చారిత్రాత్మక బోనాల జాతర అందరి సహకారంతో విజయవంతం అయిందని బోనాల ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం ఈవో గుత్తా మనోహర్ రెడ్డితో కలిసి కమిటీ సభ్యులు హేమంత్ సింగ్ ఠాకూర్, దేవి వరప్రసాద్, శ్రీకాంత్, అశ్విన్ గౌడ్, రాఖేష్ అగర్వాల్, వేణుగోపాల్, కృష్ణ ముదిరాజులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జాతర విజయవంతానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ కుమార్, ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, దేవదాయ శాఖ కమిషనర్ వెంకట్రావ్, జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తదితర విభాగాల అధికారులు నెల రోజులుగా కష్టపడి ఏర్పాట్లు చేశారని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు, వాలంటీర్లు సమన్వయంతో పనిచేయడంతో భక్తులకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా జాతర నిర్వహణ జరిగిందని అన్నారు. ప్రతి ఒక్కరికి కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు. జాతరను విజయవంతం చేసిన అధికారులకు, సిబ్బందికి, భక్తులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# పత్తి గింజల ప్రాసెసింగ్‌కు ప్రాధాన్యం పెంపొందించే జాతీయ సదస్సు




కొండాపూర్ మేజర్ న్యూస్ : ఆగస్టు రెండో మూడో తేదీలలో విజయవాడలోని ఒక ప్రముఖ హోటల్లో ఆరవ జాతీయ పత్తి గింజ నూనె మరియు మేత సదస్సు జరగబోతోంది ఈ సదస్సును సాల్వెంట్ తీసివేత కార్మిక సంఘం మరియు అఖిల భారత పత్తి గింజల క్రషర్ల సంఘం సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి రెండు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సులో పత్తి గింజల ప్రాసెసింగ్ శాస్త్రీయ విధానాలు రైతులకు ఆర్థిక లాభాలు పశువుల పోషణకు ఉపయోగాలు గ్రామీణాభివృద్ధిలో దాని స్థానం వంట నూనె భద్రతపై విస్తృతంగా చర్చించనున్నారు ఈ సదస్సును కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మాసాని చంద్రశేఖర్ ప్రారంభించనున్నారు రాష్ట్ర పశుసంవర్ధక మంత్రి అచ్చెన్నాయుడు ఖాదీ గ్రామీణ పరిశ్రమల ప్రధాన కార్యదర్శి రూప్ రాషి మూడు ఎఫ్ సంస్థ డైరెక్టర్ గోయెంకా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ శారద జయలక్ష్మి దేవి తదితరులు పాల్గొనబోతున్నారు పత్తి గింజకు కొత్త ప్రాణం నూనెకు స్థానం మేతకు ప్రాధాన్యం అనే నినాదంతో జరిగే ఈ సదస్సు వంట నూనె పశు పోషణ గ్రామీణాభివృద్ధిపై కీలక చర్చలకు వేదిక కానుంది దేశంలో పత్తి సాగు తొమ్మిది శాతం తగ్గి వంద పద్నాలుగు లక్షల హెక్టార్లకు చేరిందని అధికారులు చెబుతున్నారు గత సంవత్సరం మూడు వందల ఇరవై ఐదు లక్షల గంచెలు పత్తి ఉత్పత్తి కాగా ఈ సంవత్సరం మూడు వందల ఏడున్నర లక్షల గంచెలకు తగ్గే అవకాశం ఉందని తెలిపారు పత్తి బరువులో ఎక్కువ భాగం గింజలే కావడంతో సాగు తగ్గితే నూనె మేత ఉత్పత్తులపై ప్రభావం పడనుంది ప్రతి సంవత్సరం పన్నెండు లక్షల టన్నుల పత్తి గింజల వంట నూనె తయారు అవుతుందని సాల్వెంట్ సంఘం అధ్యక్షుడు సంజీవ్ అస్థానా తెలిపారు ఇది సోయా నూనె తరువాత మూడవ స్థానంలో ఉందని గుజరాత్‌లో ఎక్కువగా వాడతారని ఇతర రాష్ట్రాల్లో వినియోగం తక్కువగా ఉందని ఈ సదస్సు ద్వారా అవగాహన పెంచాలని చెప్పారు పత్తి గింజల నూనె రుచి వాసనకు ప్రమాణంగా నిలుస్తుందని తూర్పు వంటకాలలో ఎక్కువగా వాడతారని పశువుల మేతకు గింజల గుజ్జు ఉపయోగకరమని క్రషర్ల సంఘం చైర్మన్ సందీప్ బజోరియా తెలిపారు ప్రస్తుతం పదకొండు నుండి పన్నెండు లక్షల టన్నుల వంట నూనె తయారవుతున్నదని ఆధునిక సాంకేతికతను వినియోగిస్తే పదిహేడు లక్షల టన్నుల వరకు ఉత్పత్తి పెంచవచ్చని విదేశాలపై ఆధారత తగ్గుతుందని సాల్వెంట్ సంఘం కార్యనిర్వాహకుడు డాక్టర్ మేహతా తెలిపారు ఆంధ్రప్రదేశ్ పత్తి గింజల ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉందని ఈ సదస్సు విజయవాడలో జరుగడం గర్వకారణమని శ్రీధనలక్ష్మి మిల్స్ డైరెక్టర్ వీరనారాయణ పేర్కొన్నారు ఈ సదస్సులో మూడు వందల మందికి పైగా పరిశోధకులు పరిశ్రమల ప్రతినిధులు వ్యాపారవేత్తలు పాల్గొననున్నారని నిర్వాహకులు తెలిపారు సాల్వెంట్ సంఘానికి ఏడు వందల మంది సభ్యులు మూడు వందల కేంద్రాలు ఉండగా పత్తి గింజల క్రషర్ల సంఘానికి గుజరాత్ మహారాష్ట్ర తెలంగాణ ఆంధ్రప్రదేశ్ నుంచి పెద్ద సంఖ్యలో సభ్యులు ఉన్నారని ఇటీవలే ఈ సంఘం సువర్ణోత్సవం జరుపుకుందని నిర్వాహకులు వివరించారు.

### భారతదేశం యొక్క మొట్టమొదటి లాంగ్ డిస్టెన్స్ రోబోటిక్ బేరియాట్రిక్ టెలి సర్జరీతో భారతదేశం సర్జికల్ ఇన్నోవేషన్ యొక్క కొత్త శకానికి నాంది

## ప్రముఖ సర్జన్ డాక్టర్ మోహిత్ భండారీ గురుగ్రామ్ నుంచి ఇండోర్ మధ్య 850 కిలోమీటర్ల దూరంలో రిమోట్ ఆపరేషన్



జూబ్లీహిల్స్, మేజర్ న్యూస్: ఇర్కాడ్ ఇండియా ప్రెసిడెంట్, బేరియాట్రిక్ మరియు రోబోటిక్ సర్జన్లలో మార్గదర్శకుడు డాక్టర్ మోహిత్ భండారి ప్రపంచంలోని మొదటి సుదూర రోబోటిక్ బేరియాట్రిక్ టెలి సర్జరీని విజయవంతంగా పూర్తి చేశారు, ఇది ప్రపంచ సర్జరీ సంరక్షణ మరియు యాక్సెస్ లో కొత్త భవిష్యత్తును పునర్నిర్వచించే మైలురాయి. గురుగ్రామ్ లోని రోబోటిక్ కన్సోల్ ఉపయోగించి డాక్టర్ భండారీ గారు 850 కిలోమీటర్లకు పైగా ఇండోర్ లో ఉన్న ఒక రోగిపై సంక్లిష్టమైన గ్యాస్ట్రిక్ బైపాస్ ను నిర్వహించారు– జీరో పర్సెప్టిబుల్ ల్యాగ్ మరియు పూర్తి శస్త్రచికిత్స ఖచ్చితత్వంతో అమలు చేశారు. కొత్త తరం, భారతదేశంలో అభివృద్ధి చేసిన రోబోటిక్ శస్త్రచికిత్స ప్లాట్ఫామ్ అయిన ఎస్ఎస్ఐ మంత్ర ఎం 3 వ్యవస్థను ఉపయోగించి ఈ ప్రక్రియ జరిగింది. మెడికల్ రోబోటిక్స్ మరియు డిజిటల్ ఆరోగ్యంలో భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతున్న సామర్థ్యాలను హైలైట్ చేయడమే కాకుండా, అధిక–కష్టం ఉన్న డొమైన్లలో రిమోట్ గా దూరం నుంచి శస్త్రచికిత్స సంరక్షణ కోసం కొత్త ప్రపంచ ప్రమాణాలను స్థాపించింది. దీనిపై డాక్టర్ మోహిత్ భండారీ మాట్లాడుతూ, "శస్త్రచికిత్స చేయడంలో విప్లవాత్మకంగా మార్చడంలో రోబోటిక్ టెలిసర్జరీ యొక్క పరివర్తన సామర్థ్యానికి ఈ విజయం నిదర్శనం, నిపుణులైన శస్త్రచికిత్సలు అదే సమయంలో ఇతర భౌగోళిక ప్రాంతాలలో పనిచేయడానికి వీలు కల్పిస్తుంది మరియు పట్టణ మరియు ప్రాంతీయ సంరక్షణ కేంద్రాలను నిరాటంకంగా అనుసంధానం చేస్తుంది. భారతదేశం అంతటా మాత్రమే కాకుండా, ప్రపంచవ్యాప్తంగా శస్త్రచికిత్సా నైపుణ్యానికి యాక్సెస్ ను ఎలా అందుబాటులోకి తీసుకురావాలో ఇది ఒక మంచి ఉదాహరణ".

## జూలై 26న చౌరంగీ 'మాన్‌సూన్ డ్రీమ్స్' - ప్రముఖ నర్తకి తనుశ్రీ శంకర్‌చే నృత్య ప్రదర్శన





హైదరాబాద్, మేజర్ న్యూస్ : కళాప్రియులను కనువిందు చేసేందుకు చౌరంగి కళా, సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో జూలై 26వ తేదీన నగరంలోని తారమతి బరాదారిలో 'మాన్‌సూన్ డ్రీమ్స్' పేరుతో తనుశ్రీ శంకర్, ఆమె నాట్య బృందంచే నృత్య ప్రదర్శన కలదు. ఇది భారతీయ శాస్త్రీయ నృత్య శైలిని ఆధునికతతో మిళితం చేసిన అనిర్వచనీయ కళా ప్రదర్శన. ఇది ఒక అద్భుతమైన నృత్య రూపంగా చెప్పవచ్చు. సంగీతం, నాట్యం, కథనానికి వినూత్న రూపమిచ్చే ఒక కళా సాయంత్రం. ఇది ఒక ప్రదర్శన మాత్రమే కాదు. ఇది మన భావాలు, సంప్రదాయాలు, ప్రకృతితో అనుబంధాన్ని చక్కగా చూపించే ఒక ఉత్సవం. అద్భుతమైన ఈ నృత్య ప్రదర్శనకు ప్రతి ఒక్కరూ తప్పక హాజరు కావాల్సిందే.

తనుశ్రీ శంకర్ గురించి ఆధునిక భారతీయ నృత్య ప్రపంచంలో ఎంతో ప్రసిద్ధి చెందిన తనుశ్రీ శంకర్ భారతదేశ ప్రముఖ నర్తకులలో ఒకరు. ఆమె ఉదయ్ శంకర్ శైలికి ప్రాణం పోసి, ఆ సారస్వత వారసత్వాన్ని అంతర్జాతీయ స్థాయిలో కొనసాగిస్తున్నారంటే అతిశయోక్తి కాదేమో. ఆమె కళలో భారతీయ శాస్త్రీయ నృత్యం, జానపదం, పాశ్చాత్య, ఆధునిక నృత్య శైలులు ఎంతో అందంగా ఉన్న మిశ్రమ రూపాన్ని చూడవచ్చు. ఆమె నృత్యం అనేక సంస్కృతులు, తరాలు మించి ప్రతి ప్రేక్షకుడి హృదయాన్ని తాకే విధంగా ఉంటుంది. తనుశ్రీ శంకర్ నృత్య సంస్థ నలభై పైగా దేశాలలో ప్రదర్శనలు ఇచ్చింది. అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రపంచ వేదికలలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించింది. ఆమె ప్రదర్శనలు నాటకీయత, కవిత్వంతో కూడి వినూత్న కొరియోగ్రఫీకి ప్రసిద్ధి చెందాయి. ఆమె కళ భూతకాలం నుంచి వర్తమానానికి ప్రయాణించే ఒక నృత్య గాథ. సంగీత నాటక అకాడమీ అవార్డు, ఫిక్కీ మహిళా ప్రతిభావంతురాలి అవార్డు వంటి ఎన్నో గౌరవాలు పొందారు. సంప్రదాయాన్ని కాపాడుతూ, నూతనతను అవలంబిస్తూ ప్రపంచ ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేస్తూ ఉన్నారు. చౌరంగీ గురించి చౌరంగీ హైదరాబాద్‌లో స్థాపించిన ఒక సాంస్కృతిక వేదిక. భారతదేశపు గొప్ప కళా వారసత్వాన్ని, వైవిధ్యాన్ని నూతన సాంస్కృతిక దిశలకు తీసుకెళ్తుంది. బెంగాల్ సంస్కృతి నుంచి ప్రేరణ పొందిన ఈ వేదిక భాషా అవరోధాలు అధిగమించి వివిధ సముదాయాల మధ్య సాంస్కృతిక సమన్వయాన్ని మెరుగుపరిచే దిశగా అడుగులు వేస్తోంది. చౌరంగీ, థియేటర్, సంగీతం, నృత్యం, దృశ్య కళలు వంటి విభిన్న కళారూపాల్లో ప్రతిష్ఠాత్మక ప్రదర్శనలు నిర్వహించడంలో నిమగ్నమై ఉంది. మనందరిలో ఉన్న సాధారణ మానవీయతను ప్రతిఫలించే కథనాలను ప్రదర్శించేందుకు కట్టుబడి ఉంది. చౌరంగీ బెంగాల్ అండ్ బియాండ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

## ప్యాచ్ వర్క్ పనులను పరిశీలించిన కార్పొరేటర్ –కంది శైలజ శ్రీకాంత్



సీతాఫలమండి మేజర్ న్యూస్: బోనాల పండుగ సందర్భంగా బౌద్ధనగర్ డివిజన్‌లోని ఆలయంలో స్థానికులకు రాకపోకల్లో ఎలాంటి ఇబ్బంది లేకుండా బుధవారం స్థానిక కార్పొరేటర్ కంది శైలజ శ్రీకాంత్ ప్యాచ్ వర్క్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా పనుల్లో నాణ్యత విషయంలో రాజీపడకూడదని పేర్కొన్నారు. ఆమె వెంట స్థానిక నేతలు ఉన్నారు.

## హైదరాబాద్ మేయర్‌పై యంఆర్‌పియస్ ఆందోళన అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన



బంజారాహిల్స్,మేజర్ న్యూస్ : ఖైరతాబాద్ నియోజకవర్గం సోమాజిగూడ డివిజన్‌లోని పంజాగుట్ట సర్కిల్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఈ రోజు ఉదయం 12 గంటలకు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (%MRPS%) ఆధ్వర్యంలో నల్ల జెండాలతో నిరసన కార్యక్రమం జరిగింది. హైదరాబాద్ నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి జులై 7న బంజారాహిల్స్ %చీదీ% నగర్‌లో %MRPS% జెండా దిమ్మెను కూల్చివేసి, మాదిగ సమాజాన్ని దూషించినట్లు ఆరోపిస్తూ ఈ నిరసన చేపట్టారు.మాదిగ సమాజానికి క్షమాపణ, అట్రాసిటీ కేసు డిమాండ్

పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు జరిగిన ఈ కార్యక్రమంలో మేయర్‌పై %ూజ, ూ% అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, మాదిగ సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని, కూల్చిన %వీ=ూూ% జెండా దిమ్మెను అదే స్థలంలో పునర్నిర్మించాలని డిమాండ్ చేశారు. ఖైరతాబాద్ ఇన్‌చార్జ్ కొండ్రాపల్లి శివకుమార్ మాదిగ ఆధ్వర్యంలో ఈ నిరసన జరిగింది.ప్రముఖ నాయకుల హాజరు.ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ నియోజకవర్గం కో–ఇన్‌చార్జ్ కండె రామ్ కుమార్ మాదిగ, జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ మునిరాతీ రామకృష్ణ మాదిగ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సోమాజిగూడ డివిజన్‌లోని అన్ని బస్తీల నుంచి %వీ=ూూ, మీూ% నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ప్రముఖ నాయకులైన %వీ% రాజు మాదిగ, పురుషోత్తం మాదిగ, బొలిగిద్ద కుమార్ మాదిగ, కారుపాటి అజయ్ మాదిగ, అశోక్ మాదిగ, బోపురం వేణు కుమార్ మాదిగ, విజయ్ మాదిగ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## గంగ పుత్రుల సంఘం సభ్యులతో ఆత్మీయ కలయిక



జూబ్లీహిల్స్, మేజర్ న్యూస్: షేక్‌పేట్ డివిజన్ శీతానగర్ ప్రాంతంలో గంగ పుత్రుల సంఘం సభ్యులతో దివంగత జూబ్లీహిల్స్ ఎంఎల్ఏ మాగంటి గోపినాథ్ సోదరుడు మాగంటి వజ్రనాథ్ ఆత్మీయంగా కలిశారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు ఆయనకు హృదయపూర్వక స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాగంటి వజ్రనాథ్ మాట్లాడుతూ గంగ పుత్రుల సంఘం ఎల్లప్పుడూ మాకు అండగా నిలిచింది. భవిష్యత్తులో కూడా మీ అందరి మద్దతు నాకు ఉండాలని ఆశిస్తున్నానని పేర్కొన్నారు. సభ్యులు మాట్లాడుతూ, గోపినాథ్ తర్వాత ఆ స్థానాన్ని కొనసాగించగల నాయకుడిగా మాగంటి వజ్రనాథ్ నే చూస్తున్నామని పేర్కొన్నారు. సంఘానికి ఆయనకు మధ్య మంచి సంబంధం కొనసాగుతుందని, ఈ అనుబంధం మరింత బలపడాలని ఆకాంక్షించారు.

# ఇంటికో ఇంకుడు గుంతపై ప్రత్యేక కార్యాచరణ

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశంతో త్వరలో 90 రోజుల కార్యాచరణ
- ఇప్పటికే 12 వేల ఇంకుడు గుంతల నిర్మాణం పూర్తి
- అవగాహన కార్యక్రమాలు - మరో 16 వేల మందికి నోటీసులు
- 300 గజాల పైన ఉన్న ప్రతీ ఇంటికి ఇంకుడు గుంత తప్పనిసరి
- విజ్ఞప్తి చేసిన జలమండలి ఎండి అశోక్ రెడ్డి






హైదరాబాద్ మేజర్ న్యూస్ ( సిటీ ప్రతినిధి): జలమండలి పరిధిలో 200 గజాల ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు అవసరం.. 300 గజాల పైన ఉన్న ప్రతి ప్రాంగణంలో ఇంకుడు గుంత తప్పనిసరి నిర్మాణం చేసుకోవాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశంతో, హైద్రాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభ మార్గదర్శకత్వంలో రానున్న 3 నెలలు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులలో వర్షాలు సకాలములో పడక పోవడంతో చాలా ప్రాంతాలలో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. దాంతో ట్యాంకర్ డిమాండ్ ప్రతి సంవత్సరం కొంత మేరకు క్రమంగా పెరుగుతోంది అని వివరించారు.గత ఏడాది ట్యాంకర్ అధికంగా బుక్ చేసిన ప్రాంతాలలో.. ట్యాంకర్ బుకింగ్ పెరిగిన కారణాలకోసం సర్వే నిర్వహిస్తే, బోరుబావుల మీద ఆధారపడి, భూగర్భ జలాలు అంటడిగి, బోరులు ఎండిపోయి జలమండలి ట్యాంకర్ల మీద ఆధారపడినట్లు గుర్తించారు. అందులో 42 వేల నివాసాలను గుర్తించి సగానికి పైగా ప్రాంగణాల్లో ఇంకుడు గుంతలు లేవని, మిగతావారు తమ ఇంకుడు గుంతలను ప్రతిఏటా వర్షాకాలంలో సరైన స్థితిలో నిర్వహించడం లేదని సర్వేలో తేల్చారు.ఓ ఆర్ ఆర్ పరిధిలోని 200 గజాల ఇళ్లలో ఇంకుడు గుంతలు నిర్మించాలని.. అలాగే, 300 గజాల పైన ప్రతీ నివాసంలో ఇంకుడు గుంతలు తప్పనిసరిగా నిర్మించుకునేలా అవగాహన కల్పించడానికి త్వరలో 90 రోజుల ప్రత్యేక కార్యాచరణ నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా ఎండీ తెలిపారు. ఇందుకోసం ఎన్జీఓ ల సహాయంతో ఇప్పటికే 12 వేల ఇంకుడు గుంతల నిర్మాణం, పునర్నిర్మాణం(మెంటనేన్స్) చేశామని.. మరో 16 వేల మందికి ఇంకుడు గుంతలు నిర్మాణం కోసం నోటీసులు జారీ చేయడానికి కార్యాచరణ రూపొందించినట్టు తెలిపారు. ఇంకుడు గుంతలు నిర్మాణం చేసుకోడానికి ఈ వర్షాకాలమే సరైన సమయమని, ఇప్పుడు నిర్మిస్తే వర్షం కురిసిన ప్రతి చుక్క భూగర్భంలో ఇంకించేలాగా ప్రతిఒక్కరూ ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. అందువలన భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు తలెత్తవని అన్నారు.బుక్ చేసిన 24 గంటల్లో ట్యాంకర్ ను డెలివరీ జరుగుతుందని.. గతంలో వేసవిలో రోజుకు 11000 ట్యాంకర్లు 24 గంటలలో సరఫరా చేసామని ప్రస్తుతం రోజుకు 8500 ట్యాంకర్ల డిమాండ్ ఉందని వివరించారు. ఇంకుడు గుంతలు లేని నివాసాలు, భూగర్భ జలాలు పడిపోయిన ప్రాంతాలలో ట్యాంకర్ డిమాండ్ పెరిగిన 24 గంటల వ్యవధిలో డెలివరీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ వేసవిలో రోజుకు సగటున 11 వేల ట్యాంకర్లను విజయవంతంగా డెలివరీ చేయగలిగామని అన్నారు.ప్రస్తుతం రోజువారీ డిమాండ్ సుమారు 8600 ట్యాంకర్లు మాత్రమే ఉందని, వీటిని కూడా 24 గంటల లోపల పూర్తిగా డెలివరీ చేస్తున్నామని, మరింత డిమాండ్ పెరిగినా.. అదనంగా 3 వేల ట్యాంకర్లను కూడా సరఫరా చేసే సామర్థ్యం జలమండలికి ఉందని అన్నారు. కొన్ని ప్రాంతాల్లో సాంకేతిక సమస్యలు తలెత్తితే సరఫరా లో ఆలస్యం అవుతుందని దీనిని దృష్టిలో ఉంచుకుని సామాన్య ప్రజలు మంచినీరు సరఫరా, ట్యాంకర్లతో అందే నీటిపై ఆందోళన పడవద్దని ఈ సందర్భంగా ఎండీ విజ్ఞప్తి చేశారు.అలాగే, జలమండలి నిన్న జారీచేసిన పత్రికా ప్రకటనలో గత సంవత్సరం జూలైతో పోల్చితే ఈ జూలైలో ట్యాంకర్ల డిమాండ్ పెరిగినట్లు తెలియజేశాము.ఆ ప్రకటనలో ముఖ్య ఉద్దేశ్యం ప్రజలకు వచ్చే మూడు నెలల్లో ఇంకుడు గుంతల నిర్మాణం చేయాలనే సూచన కల్పించడం మాత్రమే.

# కల్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కులు అందజేత



శేరిలింగంపల్లి,మేజర్ న్యూస్ : శేరిలింగంపల్లి మండలం పరిధిలోని పలు డివిజన్ల పరిధిలోని పలువురికి కల్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ పథకం ద్వారా మంజూరైన 20 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి తో కలిసి రూ. 20,02,320/- ఇరవై లక్షల రెండు వేల మూడు వందల ఇరవై రూపాయల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ 20 మంది లబ్దిదారులకు కల్యాణ లక్ష్మీ షాది ముబారక్ చెక్కులు అందచేయడం చాలా సంతోషకరమైన విషయమని తెలియచేసారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని ముఖ్యమంత్రి పేదల పక్షపాతి అని, పేదింటి ఆడబిడ్డకు పెద్దన్న లాగా నిలుస్తున్నారని అన్నారు. మానవతా దృక్పథంతో కల్యాణ లక్ష్మీ షాది ముబారక్ పథకం ప్రవేశపెట్టడం జరిగిందని ,అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, పేదింటి వారి ఇండ్లలో సంతోషంగా ఆడ పిల్లల పెండ్లి జరగాలని సదుద్దేశంతో కల్యాణ లక్ష్మీ షాది ముబారక్ పథకం ఎంతగానో ఉపయోగపడుతుంది అని కోరారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, ప్రసాద్ , అక్బర్ ఖాన్, ఎండి ఇబ్రహీం, మల్లేష్ గుప్తా, రాజు నాయక్, నరేందర్ బల్లా, యూసఫ్, ఖాజా , సందీప్ రెడ్డి, మల్లేష్, గోపాల్ రావు, శివ,నరేష్, కార్యకర్తలు,లబ్ధిదారులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దాడిపై మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఫిర్యాదు

## లిసైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతిని కలిసిన ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి



మల్కాజిగిరి, మేజర్ న్యూస్: బాలాజీ వెంకటేశ్వర స్వామి టెంపుల్ అల్వాల్లో మంగళవారం జరిగిన బోనాల పండుగ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ప్రోటోకాల్ ఉల్లంఘన, బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ నాయకులు చేసిన దాడి ఘటనపై మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి బుధవారం సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతిని కలిసి ఫిర్యాదు చేశారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు శాంతి శ్రీనివాసరెడ్డి, సబితా అనిల్ కిషోర్ గౌడ్, నాయకులు బద్దం పరు శురాంరెడ్డి,ఏకే మురుగేష్, లడ్డు నరేందర్ రెడ్డి , అనిల్ కిషోర్ గౌడ్, డోలి రమేష్, హేమంత్ పటేల్, ఢిల్లీ పరమేష్, చిందం శ్రీనివాస్, శివ గౌడ్, మోసిన్, సందీప్, శైలేందర్, దినేష్, సుమన్ గౌడ్, సురేష్, పవన్ , ప్రశాంత్ రెడ్డి, రేవంత్ రెడ్డి, దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు ఉండాలన్నదే సీఎం సంకల్పం

## కూన శ్రీశైలం గౌడ్



జీడిమెట్ల మేజర్ న్యూస్ : నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పడ్డ సంవత్సరంలో వైద్య రంగానికి పెద్ద పీట వేశారని కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని షాపూర్ నగర్ లో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ తన నివాసం వద్ద రోజువారి కార్యాచరణలో భాగంగా ఇటీవలే అనారోగ్య పరిస్థితులతో ఆసుపత్రిలో చికిత్స పొందిన యం.మహేష్ కు రూ.18,500, కోట వెంకటేష్ కు రూ.32,500, ఎ.ప్రసాద్ కు రూ.26,000, మహమ్మద్ షహనాజ్ బేగం కు రూ.60,000, షహీన్ ఫాతిమా కు రూ.49,000, కొంగరి ఎల్లేష్ కు రూ.60,000 చెక్కులను పంపిణి చేశారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ సిఎంఆర్ఆఫ్ ఆర్థిక సహాయం నిరుపేదలకు వరంగా మారిందాన్నారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ప్రజాపాలన ద్వారా బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలుస్తుందని కొనియాడారు. ప్రజాపాలనలో పేద, మధ్యతరగతి ప్రజలకు కార్పొరేట్ రంగంలో వైద్యం అందించడమే ముఖ్యమంత్రి ప్రధాన లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో లబ్దిదారులు, నియోజకవర్గం ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



హయత్ నగర్, మేజర్ న్యూస్: బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ ఆర్థిక సహాయం అందజేశారు. బుధవారం చండూరు మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డులో ఇటీవల మృతి చెందిన నల్లగంటి కిరణ్ కుటుంబాన్ని పరామర్శించి, రూ.10 వేల నగదును అందజేశారు. అదేవిధంగా 2వ వార్డులోని ఎర్రజెల్ల కమలమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. పదివేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అనంత చంద్రశేఖర్ గౌడ్, మాజీ వైస్ చైర్మన్ ధోటి సుజాత వెంకటేష్ యాదవ్, కల్మికొండ పారిజాత జనార్ధన్ , నల్లగంటి మల్లేశం, పున్న దర్మేందర్, భూతరాజు వేణు, ముజ్జు , గండూరి జనార్ధన్, రామ్మూర్తి, కల్లెట్ల మారయ్య, బూతరాజు దశరథ, గజ్జెల కృష్ణారెడ్డి, చరణ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సూర్య

విలేకరులు కావలెను

కావలసిన సెంటర్లు

ఎల్.బి. నగర్ జోన్ ఇన్‌ఛార్జ్,

సరూర్‌నగర్ మునిసిపాలిటీ రిపోర్టర్లు

ఆసక్తిగల అభ్యర్థులు

సిటీ ఇన్‌ఛార్జ్: నాగభూషణం, హెచ్.ఆర్.

9494662279

నంబర్‌ను సంప్రదించగలరు.

సూర్య కార్యాలయం

Surya Soudha, Plot No.185, Siddi Vinayaka Nagar,
Opp: Hi-Tech City, Near YSR Statue, 100 Ft. Road,
Madhapur, Hyderabad - 500 072

# వనస్థలిపురం శారదానగర్ వాసి డా. సిరిపురపు అప్పారావుకు ఘనంగా గురు సత్కారం

## ఆర్షధర్మ సేవా రత్న బిరుదు ప్రధానం



వనస్థలిపురం,మేజర్‌న్యూస్ః అఖిల భారతీయ బ్రాహ్మణ మహా సంఘం ఆంధ్రప్రదేశ్ శాఖ ఆధ్వర్యంలో గత మూడు రోజుల క్రితం విద్వత్ మహాసభలు జూలై 13,14,15 తేదీలలో నరసరావుపేట లోని కాసు కళ్యాణ మండపంలో జరిగాయి. ఎ.పి శాఖ అధ్యక్షుడు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ, గౌరవ అధ్యక్షులు పిటిజివి రంగాచార్యులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత, కార్యవర్గ సభ్యులు, పంచంగ కర్తలు, జ్యోతిష్య నిపుణులు, వేద పండితులు ఇతర ప్రముఖులు హాజరయిన ఈ కార్యక్రమంలో వివిధ రంగాలలో సేవలందించిన వారికి గురు పురస్కారాల ప్రధానోత్సవం చేశారు. స్వర్గీయ మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ పండితుని మనుమడు, వ్యాపార వేత్త గౌరవరం సుబ్రహ్మణ్యశర్మ, తిరుపతి సంస్కృత విశ్వ విద్యాలయం ఉప కులపతి ఆచార్యకృష్ణమూర్తి, అనేక మంది ఘన పాటిలు హాజరై పండుగులు, పర్వదినాల తేదీల నిర్ణయం, దేశంకు సంభందించిన జ్యోతిష్య సంబందించిన అంశాల పై విస్తృత చర్చ జరిపారు. వనస్థలిపురం శారదానగర్ కు చెందిన డా. శిరిపురపు అప్పారావు కు గురు పురస్కారం ఘనంగా నిర్వహించి ఆర్షధర్మ సేవా రత్న బిరుదును ప్రధానం చేశారు. మూడు దశాబ్దాలు పైగా బ్రాహ్మణ వెల్ఫేర్ గురించి, రామకృష్ణ మఠం వివేకానంద కేంద్రాలతో సహా నిర్వహించిన సామాజిక, సాంస్కృతిక సేవలను ప్రస్తుతించి దుశ్వాలువ, మెమెంటో సర్టిఫికెట్‌తో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ ఈ సత్కరంతో తనపై మరింత బాధ్యత పెరిగిందని, మరింత స్ఫూర్తితో సామాజిక, సాంస్కృతిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటు తన వంతు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని తెలిపారు.

# మూసాపేట సర్కిల్ డిసిని సత్కరించిన 7వ పేజీ అసోసియేషన్ నేతలు

కూకట్ పల్లి, మేజర్ న్యూస్: కూకట్ పల్లి హౌసింగ్ బోర్డ్ కాలనీలోని ఏడవ పేజీలో జిహెచ్ఎంసి మూసాపేట సర్కిల్ డి.సీ సేవా ఇస్లావత్ డిప్యూటీ కమిషనర్ ఆకస్మిక తనిఖీ చేసి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను కలిసి వీధి దీపాలు గురించి పుల్లా రావు కి ఫోన్ చేసి మెటీరియల్ తీసుకొని అక్కడ లైట్లు వెలిగించమని డైరెక్టర్ ఫోన్ చేసి చెప్పారు. తరువాత రోడ్డుపై ఉన్న గుంతలు తయారయ్యాయని బీసీ దృష్టికి తీసుకెళ్లడంతో డిప్యూటీ కమిషనర్ సానుకూలంగా స్పందించి వెంటనే తాత్కాలిక మరమ్మతులు చేయాలని ఏఈని ఆదేశించారు. అదేవిధంగా దోమల నివారణకు తగు చర్యలు తీసుకోమని క్రింది స్థాయి సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ ప్రతాప్, అంజిబాబు నరసింహులు, హరిబాబు, లక్ష్మీనారాయణ మొదలగు వారు పాల్గొన్నారు.



# "న్యాయవాదులు కదలితే దేశమే కదలుతుంది" రంగారెడ్డి బార్ అసోసియేషన్ సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు




సోమాజిగూడ/మేజర్ న్యూస్: రంగారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్ నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మరియు సీనియర్ న్యాయవాది ఎన్. రాంచందర్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన న్యాయవాదుల పాత్ర, యువ న్యాయవాదులకు మార్గదర్శనం, రాష్ట్ర రాజకీయాలపై కీలక వ్యాఖ్యలు చేశారు."నేను కూడా అడ్వకేట్ కమ్యూనిటీకి చెందినవాడినే కాబట్టి, ఇలాంటి వేదికపై మాట్లాడడం నాకు గర్వంగా ఉంది," అంటూ ఆయన అన్నారు. న్యాయవాదుల పట్ల తన అంకితభావాన్ని వ్యక్తం చేసిన ఆయన, "మనం వేర్వేరు పార్టీలకు చెందినవారైనా, కోర్టులో వాదనలు ముగిసిన తర్వాత కలిసి మెలసి ఉండే సాంప్రదాయం న్యాయవాదుల్లో ఉంటుంది," అన్నారు.అరుణ్ జైట్లీ, కపిల్ సిబల్, అభిషేక్ మను సింఘ్వీ వంటి దేశ స్థాయి న్యాయవాదుల ఉదాహరణలు వెల్లడిస్తూ, "వారు వేర్వేరు పార్టీలకు చెందినవారైనా న్యాయవాదిత్వంలో పరస్పరం గౌరవంతో వ్యవహరించారు. అదే సంస్కృతి మనకు అవసరం" అన్నారు.యువ న్యాయవాదులకు పిలుపు ఇస్తూ, "ఈ ప్రొఫెషన్‌ను సిన్సియర్‌గా తీసుకొని, ప్రజలకు న్యాయం అందించడంలో పాలుపంచుకోవాలి" అన్నారు.ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై మాట్లాడుతూ, "అసెంబ్లీ సమావేశాలను చూడటానికి ప్రజలు కూడా భయపడుతున్నారు. కొత్త కొత్త బూతులు నేర్చుకోవాల్సి వస్తుందన్నది వారి ఆవేదన," అంటూ రాష్ట్ర రాజకీయాలపైన తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు.తెలంగాణ ఉద్యమంలో న్యాయవాదుల పాత్రను గుర్తు చేస్తూ, "రాష్ట్ర ఏర్పాటులో న్యాయవాదులు కీలకంగా పని చేశారు. అదే స్ఫూర్తితో ప్రజాసేవలో ముందుకు సాగాలి" అన్నారు.రాజకీయాల్లో న్యాయవాదుల ప్రాధాన్యతను స్పష్టం చేస్తూ, "దేశవ్యాప్తంగా సుమారు 250 మంది న్యాయవాదులు పార్లమెంట్ సభ్యులుగా ఉన్నారు. ఇది న్యాయవాదుల అర్హతకు నిదర్శనం" అన్నారు.తన రాజకీయ ప్రయాణం గురించి మాట్లాడుతూ, "గెలిచినా ఓడినా, నేను నమ్మిన సిద్ధాంతాల కోసమే పనిచేశాను. డబ్బు కోసం రాజకీయాలు చేయనని అన్నారు. సమావేశం లో బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

# మున్సిఫ్ డైలీ న్యూస్ పేపర్ సీనియర్ ఫోటోగ్రాఫర్ షేక్ నసీర్ మృతి

### నసీర్ మరణం దిగ్భ్రాంతి కలిగించింది : TWJF-మామిడి సోమయ్య రాష్ట్ర అధ్యక్షుడు



హైదరాబాద్, మేజర్‌న్యూ మున్సిఫ్ డైలీ న్యూస్ పేపర్ సీనియర్ ఫోటోగ్రాఫర్ షేక్ నసీర్ ఈ రోజు ఉదయం కన్నుమూశారు. ఆయన చాలా కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. నసీర్ సౌమ్యుడు. మంచి ఫోటో గ్రాఫర్. నాకు చాలా ఏళ్లుగా పరిచయం ఉన్న నసీర్ మరణం దిగ్భ్రాంతి కలిగించింది. నసీర్ మృతికి సంతాపం, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తున్నాను.

# పేద కుటుంబానికి అండదండ సీఎం రిలీఫ్ ఫండ్

★ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మాజీ మేయర్ అందజేత

బాలాపూర్ మేజర్ న్యూస్(జులై 16): అనారోగ్య సమస్యలతో చికిత్స చేయించుకుంటున్న నిరుపేద కుటుంబానికి అండదండ, సీఎం రిలీఫ్ ఫండ్ అని మాజీ మేయర్ అన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాలాపూర్ లో సీఎం ఆర్ ఎఫ్ చెక్కులను మాజీ మేయర్, మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నరసింహారెడ్డి చేతుల మీదేగా నిరుపేద కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... అనారోగ్య సమస్యలతో చికిత్స చేయించుకున్న పేదవారికి ప్రభుత్వం అండగా ఉండాలని, తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి పేద కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందజేయడం జరుగుతుందని అన్నారు. బాధితులు కేశవులు, నూర్ జాన్ బేగం, అంజయ్య, భాస్కరాచార్యులు, కడారి బిక్షపతి కుటుంబాలకు మంజూరైన చెక్కులను మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్ రెడ్డి, పెద్దబావి సుదర్శన్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చిగిరింత దయాసాగర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజక వర్గ మాజీ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుభాన్ యాదవ్, బద్దం రాము గౌడ్, జెల్ల రమేశ్ గౌడ్, నీరుడు శ్రీరాములు, ఉమేష్, నయనా చారి, గిరి ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

# బెంగళూరులో ఫ్లిప్‌కార్ట్ 'ఫుడ్ ఫెస్ట్ 2.0'



జూబ్లీహిల్స్, మేజర్ న్యూస్: భారతదేశంలో స్వదేశీ ఈ-కామర్స్ మార్కెట్ ప్లేస్ ఫ్లిప్‌కార్ట్ బెంగళూరులో జూలై 8, 9వ తేదీలలో 'ఫుడ్ ఫెస్ట్ 2.0' నిర్వహించింది. ఇది రెండో ఎడిషన్. జూలై 5 నుంచి జూలై 10వ తేదీ వరకు క్యూరేటెడ్ సేల్ ద్వారా ఈ ఫెస్ట్ ఆన్‌లైన్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఫ్లిప్‌కార్ట్ కన్స్యూమబుల్స్ (బ్యూటీ, ఎఫ్ఎంసీజీ, హెల్త్‌కేర్) సీనియర్ డైరెక్టర్ నిశాంత్ దలాల్ మాట్లాడుతూ ఈ ఫుడ్ ఫెస్ట్ ద్వారా గౌర్మెట్ ఫుడ్ డిస్కవరీ, స్టోరీ టెల్లింగ్, కమ్యూనిటీ నేతృత్వంలోని వాణిజ్యం కొత్త యుగాన్ని నిర్మిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా హాప్పిలో వ్యవస్థాపకుడు, సీఈఓ వికాస్ నహర్ మాట్లాడుతూ ఫుడ్ ఫెస్ట్ 2025 కోసం ఫ్లిప్‌కార్ట్‌తో భాగస్వామ్యం ఆనందంగా ఉందన్నారు. ప్యానెల్ చర్చలు, ప్రత్యక్ష ప్రదర్శనల ద్వారా వినియోగదారులతో నేరుగా కనెక్ట్ అవ్వగలిగామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ చెఫ్‌లు, అగ్రశ్రేణి క్రియేటర్లు, ఐకానిక్ బ్రాండ్‌లు, ఆహార ప్రియులు పాల్గొన్నారు. ఆహార స్టాళ్లు, గౌర్మెట్ రుచి నుండి లైవ్ క్రియేటర్ చర్చల వరకు, ఆన్-గ్రౌండ్ అనుభవం లీనమయ్యే బ్రాండ్ అనుసంధానిత చర్చలను నడిపించడానికి రూపొందించబడింది. కాక్‌టెయిల్ కొంపానీ ద్వారా మిక్సాలజీ మాస్టర్‌క్లాస్, ది పర్ఫెక్ట్ కాఫీ బ్రూయింగ్ సెషన్, హై-ఎనర్జీ ఫ్లిప్‌కార్ట్ మాస్టర్‌చెఫ్ ఛాలెంజ్ వంటి ఇంటరాక్టివ్ సెషన్‌లు ఆచరణాత్మక అనుభవాన్ని అందించాయి. ఇవి ఆహ్లాదకరమైన, ఇంటరాక్టివ్ ఫార్మాట్‌లో ఉద్భవిస్తున్న ఆహార ధోరణులు, బ్రాండ్ కథనాలతో నేరుగా పాల్గొనడానికి వీలు కల్పించాయి. ఈ కార్యక్రమానికి ప్రముఖ టెలివిజన్ వ్యక్తిత్వ, పాకశాస్త్ర ఔత్సాహికురాలు, గోరెట్టి ఆతిథ్యం ఇచ్చారు. వీరు భారతీయ ఆహారం %ဖ% ఆరోగ్య వినియోగదారులను సృష్టికర్తలు, బ్రాండ్ నాయకత్వంతో పునర్నిర్వచించే కొత్త యుగ బ్రాండ్‌లపై దృష్టి సారించిన ప్యానెల్ చర్చకు నాయకత్వం వహించారు. ఈ ప్యానెల్ చర్చలు ఆహారం, వెల్నెస్ పర్యావరణ వ్యవస్థ నుండి కీలక స్వరాలను ఒకచోట చేర్చాయి, అభివృద్ధి చెందుతున్న వినియోగదారుల ప్రాధాన్యతలు, క్లీన్-లేబుల్ ట్రెండ్‌లు మరియు డి2సి అవకాశాలపై విలువైన దృక్పథాలను అందించాయి.

# సహకారం..



ముషీరాబాద్ మేజర్ న్యూస్ :గాంధీనగర్ డివిజన్ లోని పలు అమ్మవార్ల దేవాలయాల అభివృద్ధి కొరకు తమ వంతు సహాయ సహకారాలు అందజేయడం తమకు అదృష్టంగా భావిస్తున్నామన్నారు గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్ అందులో భాగంగా, అరుంధతి నగర్ బస్తి లోని శ్రీ కట్ట మైసమ్మ తల్లి ఆలయంలో అమ్మవారి విగ్రహ పునర్ ప్రతిష్టాపన ఇటీవల జరిగిన అనంతరం, అమ్మవారి విగ్రహానికి సుమారు డెబ్బై ఒక్క తులాల (710 గ్రామ్స్) వెండితో చేయించిన చేతుర్భుజాలు ( నాలుగు చేతులు) వెండి తొడుగులను కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్ దంపతులు అమ్మవారికి సమర్పించి అలంకరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ దేవాలయాలను కాపాడుకోవడం మన హిందు ధర్మం, వాటిని అభివృద్ధి పరుచుకొని సంప్రదాయబద్ధంగా భక్తి శ్రద్ధలతో పూజించుకొని, దేవతల దీవెనలు పొందడం అనేదే సనాతన ధర్మ పరిపాలన అన్నారు.ఇలాంటి ఆత్యద్మికచింతన ప్రతివొక్కరు అలవర్చుకోవాలని కోరారు.ఈ సదవకాశం కల్పించి,దేవాలయాల అభివృద్ధిలో తమను భాగస్వాములను చేసే అదృష్టాన్ని కలిగించిన ఆ అమ్మవారికి నమస్సుమాంజలి సమర్పిస్తున్నాను అన్నారు కార్పొరేటర్. ఈ కార్యక్రమంలో బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్,సీనియర్ నాయకులు రత్న సాయి చంద్,శ్రీకాంత్,శివ కుమార్,సురేష్, డివిజన్ ప్రధాన కార్యదర్శి ఆనంద్ రావు,సాయి కుమార్,జ్ఞానేశ్వర్,బస్తి మరియు గుడి కమిటీ సభ్యులు బెల్ బాటమ్ రాజు, సి.హెచ్ రాజు,పి.యదగిరి, నాగుల ప్రకాష్,శ్రీనివాస్ గౌడ్,మెరుగు శ్రీనివాస్ యాదవ్,సరస్వతి,రాములమ్మ,నీలమ్మ, భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

సూర్య
www.suryaa.com
గురువారం
17 జూలై 2025

# ఘనంగా గోషామహల్‌లోని చందన్‌వాడిలో బోనాల ఉత్సవాల సంబరాలు



అబిడ్స్‌జోన్ ఇన్‌ఛార్జ్,మేజర్‌న్యూస్ః ప్రతి ఏటా గోషామహల్‌లోని చందన్‌వాడిలో పాతబస్తీ సామూహిక బోనాల ఉత్సవాలు ఆదివారం జరుగుతుంటే,ఇక్కడమాత్రం ఆదివారానికి ముందు అనగా ప్రతి ఏటా బుధవారం రోజున చందన్‌వాడి పరిసర బస్తీల ప్రజలు బోనాల ఉత్సవాలను నిర్వహించడం అనవాయితీగా వస్తుంది. అందులో భాగంగా బుధవారం చందన్‌వాడిలో ఉదయంనుంచే బస్తీ ప్రజలు,మహిళలు ప్రత్యేకంగా అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేకంగా సామూహిక బోనాలను అమ్మవారికి భక్తిపూర్వకంగా సమర్పించి, తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు,భక్తులు అమ్మవారికి ఎంతో ఆనందోత్సవంతో,పోతరాజుల విన్యాసాలు,డప్పు వాయిద్యాలతో ఫలహార బండ్లను అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా బి.జె.పి. రాష్ట్ర నేత డి. గోపాల్‌జీ,కె.రఘు,పూజారి నర్సింగ్‌రావులు ప్రత్యేకంగా చందన్‌వాడిలోని చారిత్రాత్మకమైన ఉజ్జీ మహంకాళి ఐదు గుళ్ళల్లో,ఏడుగుళ్ళలో,దుర్గామాత దేవాలయంలో, భైరవి మాతా ఆలయాల్లోకివెళ్ళి అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు.

# అపుహాలు నమ్మవద్దు

- చిత్రపురి సొసైటీ సెక్రటరీ దొర పై సస్పెన్షన్ వేటు అనే ప్రచారం నిజం లేదు
- మేనేజర్స్ యూనియన్ జనరల్ బాడీ తీర్మానమే లేదు
- మేనేజర్ యూనియన్ కి, చిత్రపురికి సంబంధమే లేదు

హైదరాబాద్, మేజర్ న్యూస్ : తెలుగు సినీ మేనేజర్స్ యూనియన్ లో ల్యాండ్ కొనుగోలు విషయమై గత రెండేళ్ళాగా పాత కమిటీకి, కొత్త కమిటీ కి మధ్య జరుగుతున్న వాదోపవాదాలకు మరో మూడు నెలలులో తెరపడనున్నట్టు తెలుస్తుంది. 1-2 ఏళ్ల క్రితం పాత కమిటీ (ఆనాటి కమిటీ) మేనేజర్స్ యూనియన్ సభ్యుల శ్రేయస్సు దృష్ట్య ల్యాండ్ కొని సభ్యుల్కు పంచుదామని నిర్ణయించుకున్నారు. అయితే ల్యాండ్ కొనుగోలు విషయం లో బారి అవకతవకలు జరిగాయని కొందరు సభ్యులు ఆరోపించడం, కేసు లు పెట్టడం తో సభ్యులకి ల్యాండ్ పంపిణీ కాలేదు. తర్వాత ఎలక్షన్ రావడం తో నూతన కమిటీ పాత కమిటీ చేసిన భులవదేవిలు బయటకు తీసి ఒక కమిటీ వేసి నివేదిక తెచ్చారు. ఈ నివేదిక ప్రకారం కొంత ల్యాండ్ లేదని పాత కమిటీ పై చర్యలు తీసుకోవాలని ఆదివారం అన్నపూర్ణ స్టూడియో లో జరిగిన మేనేజర్స్ యూనియన్ సమావేశం లో కమిటీ ప్రస్తావించగా పాత కమిటీ అధ్యక్షులు దొర మాట్లాడుతూ అబ్జక్షన్ తెలిపారు. ఆ నివేదికలో నిజం లేదని, తమ పై ఆరోపను చేసిన సందర్భం లో ల్యాండ్ సర్వే చేయించేటప్పుడు తమని పిలవాలని, మీ అంతట మీరే సర్వే చేయించి మా మీద నిందలు వేయడం మంచిది కాదని, తమకు 6 నెలలు సమయం ఇస్తే ల్యాండ్ కొలిపించి



అప్పగిస్తామని దొర చెప్పడం తో, పలువురు సభ్యులు సైతం కొంత సమయం ఇవ్వాలని సూచించడం తో సమావేశం లో యూనియన్ 3 నెలలు సమయం ఇస్తున్నట్టు సభ్యులముందు ప్రకటించారు. అయితే.. కావాలని పలువురు దొర ప్రతిష్ట భంగం కలిగించే ప్రయత్నం చేస్తున్నారని, లేని పోని ప్రచారాలు చేస్తే సభ్యులను తప్పుడు సంకేతం లోకి తీసుకెళ్తున్నట్టుందని దొర ఆవేదన చెందారు. మేనేజర్స్ యూనియన్ కి చిత్రపురి కమిటీ సంబంధం లేదని, రెండు వేరు వేరు కమిటీలని, మేనేజర్స్ యూనియన్ లో అంశాలు చిత్రపురి కి ముడి పెట్టి అందర్నీ కన్ఫ్యూజ్ చేస్తున్నారని చెప్పారు . యూనియన్ లో తన పై వచ్చిన అభియోగం నిరూపించుకోవడానికిసమయం ఇచ్చారని, ఎక్కడ తామ నికాయితీ నిరూపణ అయితే తట్టుకోలేక ఇప్పటినుంచే విష ప్రచారం చెయ్యడం మంచికాదని దొర అన్నారు .

# నాణ్యత, నమ్మకం వరుణ్ డెవలపర్స్ ప్రత్యేకత

**రియల్ ఎస్టేట్ రంగంలో వరుణ్ డెవలపర్స్‌ది ప్రత్యేక పాత్ర**

**వరుణ్ డెవలపర్స్ మార్కెటింగ్ అండ్ కస్టమర్ మీట్ లో స్ఫూర్తి సేవా సమితి అధ్యక్షుడు కొలిశెట్టి సంజయ్‌కుమార్**



వనస్థలిపురం,మేజర్‌న్యూస్ఃనాణ్యత, నమ్మకంతో మంచి వ్యాపారం నిర్వహిస్తు వినియోగదారుల మన్ననలు పొందుతు 15 సంవత్సరాలుగా రియల్ ఎస్టేట్ రంగంలో అనేక వెంచర్లను దిగ్విజయంగా అమ్మకాలను నిర్వహిస్తు కస్టమర్ల నమ్మకాన్ని నిలబెట్టుకుంటున్న వరుణ్ డెవలపర్స్ సేవలు హర్షణీయమని స్ఫూర్తి సేవా సమితి అధ్యక్షులు కొలిశెట్టి సంజయ్‌కుమార్ కొనియాడారు. పేద, మధ్య తరగతి ప్రజలకు సొంతింటి కళను నెరవేర్చాలనే సదుద్దేశ్యంతో రియల్ వ్యాపారాన్ని నిర్వహిస్తున్న వరుణ్ డెవలపర్స్ సియండి డా. కొరె రమేష్ నాయుడు లాంటి వ్యాపారులు సమాజానికి ఎంతో అవసరమన్నారు. మీర్‌పేట్ నందిహిల్స్‌లో ఒక ఎకరం స్థలంలో నాగధార గ్రాండ్, గేటెడ్ కమ్యూనిటీ లగ్జరీ 2బిహెచ్‌కె, 3 బిహెచ్‌కె అపార్ట్‌మెంట్స్ సర్వ హంగులతో నిర్మాణ పనులు పూర్తయిన సందర్భంగా ఫ్లాట్స్ బుకింగ్ కొరకు వరుణ్ డెవలపర్స్ సిఎండి డా. కోరే రమేష్ నాయుడు ఆధ్వర్యంలో మార్కెటింగ్ అండ్ కస్టమర్ మీట్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా స్ఫూర్తి సేవా సమితి అధ్యక్షులు కొలిశెట్టి సంజయ్‌కుమార్ హాజరై గత 15 సంవత్సరాలుగా రియల్ ఎస్టేట్ రంగంలో అత్యుత్తమ సేవలు అందిస్తు కస్టమర్ల మన్ననలు పొందుతున్న వరుణ్ డెవలపర్స్ నేడు గేటెడ్ కమ్యూనిటీ లగ్జరీ అపార్ట్‌మెంట్స్ అమ్మకాలను ప్రారంభిస్తున్న శుభ సందర్భంగా సంస్థ సిఎండి రమేష్ నాయుడు, మార్కెటింగ్ డైరెక్టర్లకు శుభాకాంక్షలు తెలుపుతు కష్టపడి పని చేసే వారికి ఎల్లప్పుడు మంచి ఫలితాలు ఉంటాయని కస్టమర్ల అభిరుచులకు అనుగుణంగా ముందుకు సాగుతున్న వరుణ్ డెవలపర్స్ ను ప్రజలు ఎల్లపుడు ఆదరిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా అపార్ట్‌మెంట్స్‌కు సంబందించిన బ్రోచర్‌ను సంజయ్ కుమార్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. వరుణ్ డెవలపర్స్ సిఎండి డా. కొరె రమేష్ నాయుడు మాట్లాడుతూ సమాజంలోని ప్రతి ఒక్కరికి సొంతింటి కళ నేరవేరాలనే సంకల్పంతో వరుణ్ డెవలపర్స్ ముందుకు సాగుతుందని, పేద,మధ్య తరగతి ప్రజలకు అనువైన ధరల్లో సొంతింటిని అందించాలనే లక్ష్యంతో వరుణ్ డెవలపర్స్ ప్రణాళికా బద్దంగా పని చేస్తుందన్నారు. ధనార్జనే లక్ష్యం కాకుండా స్వల్ప లాభాలతో అన్ని వర్గాల వారికి అనువైన ధరల్లో సొంతింటిని అందించేందుకు వరుణ్ డెవలపర్స్ సంస్థ ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ శ్రీనివాస్, కిరణ్‌గౌడ్, సంతోష్‌కురుమ, మార్కెంటింగ్ డైరెక్టర్స్ సంధ్య , బాలరాజు, వెంకటేష్, బాలకృష్ణ, సునీత తదితరులు పాల్గొన్నారు.

# వర్క్‌షాప్



ముషీరాబాద్ మేజర్ న్యూస్ :ఔషాపూర్ లో స్థానిక సంస్థల ఎన్నికల కార్యశాల లో పాల్గొన్న బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు, జాతీయ కౌన్సిల్ సభ్యురాలు గీతా మూర్తి, రాష్ట్ర కార్యదర్శి జయశ్రీ.బీజేపీ అగ్ర నేతలు పాల్గొన్నారు. దిశా నిర్దేశం చేశారు

## నగర పోలీస్ కమీషనరేట్‌లో అగ్నిప్రమాదంపై మాక్ డ్రిల్ కార్యక్రమం






సిటీబ్యూరో,మేజర్‌న్యూస్ః బంజారహిల్స్ రోడ్డు నెం. 12లోని టిజిఐసిసిసి నగర పోలీస్ కమీషనర్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ప్రాంగణంలో సెంటర్ డైరెక్టర్ రిటైర్డు వి.బి. కమలాసన్‌రెడ్డి పర్యవేక్షణలో బుధవారం ప్రత్యేకంగా అగ్నిప్రమాదంపై మాక్ డ్రిల్ కార్యక్రమంను నిర్వహించారు. సెంటర్‌లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫైర్,పోలీస్,ట్రాఫిక్,రెవెన్యూ,హైడ్రా,మెడికల్ అండ్ హెల్త్,విద్యుత్,జలమండలి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

....

## పాన్ ఇండియా ఆధ్వర్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో ఉచిత స్కిన్ హెల్త్ క్యాంపు




అబిడ్స్‌జోన్ ఇన్‌ఛార్జ్,మేజర్‌న్యూస్ః ఉస్మానియా ఆసుపత్రిలోని డి.వి.ఎల్. శాఖ తరపున పాన్ ఇండియా జంట నగరంలోని బోరబండ,అఫ్జల్‌గంజ్, గౌలిగూడ,కోఠి ప్రాంతాల్లో ఉచిత స్కిన్ హెల్త్ క్యాంపును నిర్వహించి,చర్మ వ్యాధితో బాధపడుతున్న 750 మంది రోగులకు ప్రత్యేకంగా పరీక్షించి,వారికి తగిన సూచనలు,సలహాలు,తగిన మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా ఆసుపత్రికి చెందిన ప్రొఫెసర్లు,ఆర్.ఎం.ఓ.లు,డాక్టర్లు,వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీకి బీసీలపై చిత్తశుద్ధి ఉంటే డిల్లీలో బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించాలి

● బిజెపి నేతలు బీసీలను తప్పుదోవ పట్టించడం తగదు ● ఏపీలో ఇండియా కూటమి ప్రభుత్వం ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నది నిజం కాదాలి? ● బీసీ రిజర్వేషన్లపై బిజెపి, బీఆర్ఎస్ ద్వంద విధానం అవలంబిస్తున్నాయి ● బీసీ రిజర్వేషన్లపై బిఆర్ ఏస్ కు చిత్తశుద్ధి ఉంటే ఢిల్లీలో మాజీ సిఎం కేసీఆర్ దీక్ష చేయాలి ● బిఆర్ఎస్ నేతల వైఖరి చూస్తుంటే హంతకుడే సంతాపం తెలిపినట్టుంది ● రిజర్వేషన్ల పెంపు ఆర్డినెన్స్ ను గవర్నర్ ఆమోదించాలి ● వచ్చేనెల (ఆగస్టు 7న) గోవాలో జాతీయ ఓబీసీ మహాసభ ● ఓబిసి జాతీయ మహాసభ పోస్టర్ ఆవిష్కరణలో జాజుల శ్రీనివాస్ గౌడ్



సోమాజిగూడ/మేజర్ న్యూస్: బీసీ రిజర్వేషన్ల పెంపు పై బిజెపి టిఆర్ఎస్ నేతలు అదేపనిగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం జీవో ఇచ్చిన, ఆర్డినెన్స్ తెచ్చిన కోర్టులలో నిలువదని అని గ్లోబల్ ప్రచారానికి తెగబడుతున్నారని ఇలాంటి ప్రచారాలు మానుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ బిజెపి టిఆర్ఎస్ నేతలకు విజ్ఞప్తి చేశారు ఆగస్టు 7న గోవాలో జరిగే జాతీయ ఓబీసీ మహాసభ లను విజయవంతం చేయాలని కోరుతూ ఈరోజు బీసీ కుల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో మహాసభ పోస్టులను కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి లతో కలిసి జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావు, కేంద్రమంత్రి బండి సంజయ్ లు నిన్న బీసీ రిజర్వేషన్లపై అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, 42% బీసీ రిజర్వేషన్ల లోనే 10 శాతం ముస్లింలకు రిజర్వేషన్లు అమలు చేస్తున్నారని ఆరోపించడన్నీ తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు విద్యార్థి దశ నుండే రామచంద్రరావు బీసీ రిజర్వేషన్ల వ్యతిరేకి అని ఆయన ఆరోపించారు తెలంగాణ ప్రభుత్వం బీసీలకు విద్యా ఉద్యోగ రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లను పెంచుతూ తెలంగాణ అసెంబ్లీలో బిల్లు ఆమోదించి గవర్నర్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పంపి మూడు నెలలు పూర్తి అయినప్పటికీ నేటి వరకు ఆ రిజర్వేషన్ల బిల్లుకు ఆమోదం తెలపకుండా బీసీలకు అన్యాయం చేస్తూ పైగా మత ప్రతిపదికన రిజర్వేషన్లు ఉంటే మేము ఆమోదం తెలుపము అని చెప్పి తప్పించుకోవడం వారి దివాలకోరుతనానికి నిదర్శనం అన్నారు దేశవ్యాప్తంగా ప్రస్తుతం బీసీలకు అమలవుతున్న 27% రిజర్వేషన్లలో కూడా ముస్లిం సమాజం ఉన్నదని అదేవిధంగా ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలైన చాలా రాష్ట్రాల్లో ముస్లింలకు రిజర్వేషన్లను మత ప్రతిపదికన అమలు చేస్తున్నారని, ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమేనని ఇది నిజం కాదా ..? అని శ్రీనివాస్ గౌడ్ బిజెపి నాయకులను ప్రశ్నించారు బిజెపి అధ్యక్షుడు రాంచందర్ రావు విద్యార్థి రాజకీయాలలో ఉన్నప్పుడు సామాజిక రిజర్వేషన్లు, అలాగే మండల కమిషన్ సిఫార్సులకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాలలో ఆయన పాల్గొన్నారని, ఆనాటి నుండి ఈనాటి వరకు బిజెపి అధ్యక్షుడు రిజర్వేషన్లపై సానుకూల వైఖరి తో ఉండకుండా ఇప్పటికి కూడా బీసీ రిజర్వేషన్లను వ్యతిరేకించడం బిజెపి బీసీల వ్యతిరేకిగా మారిందనడానికి ఇది ఉదాహరణ అని ఆయన అన్నారు బిసి సామాజిక వర్గానికి చెందిన బండారు దత్తాత్రేయ గారిని హర్యాన గవర్నర్ పదవి నుండి తొలగించడం, అలాగే నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన బిసి సామాజిక వర్గానికి సంబంధించిన రాజాసింగ్ ను బిజెపి నుండి బహిష్కరించడం, బిజెపి రాష్ట్ర అధ్యక్షులుగా బీసీలకు అవకాశం ఇవ్వకుండా అగ్రకులాలకు చెందిన రామచంద్రరావుకు అధ్యక్ష పదవి కట్టబెట్టడం బీసీ వ్యతిరేక చర్య కాదా అంటూ బిజెపిపై శ్రీనివాస్ గౌడ్ తీవ్రంగా మండిపడ్డారు ఇక టిఆర్ఎస్ నేతలు గత పది సంవత్సరాలుగా కేసీఆర్ ప్రభుత్వంలో భాగస్వామ్యంగా ఉండి బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుండి 18% తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయంలో భాగస్వామ్యంగా ఉండి బీసీలకు అన్యాయం చేసిన వీరే, ఈరోజు బీసీ రిజర్వేషన్లు పెంచాలని మాట్లాడడం దయ్యాలు వేదాలు వల్లించిన చందంగా ఉందన్నారు బీసీ రిజర్వేషన్లను తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని టిఆర్ఎస్ నేతలు డిమాండ్ చేయడం లేదంటే బీసీ రిజర్వేషన్ల విషయంలో బిజెపి బీఆర్ఎస్ ఒక్కటేనని బీసీలు భావిస్తున్నారని, నిజంగా బీసీ రిజర్వేషన్లు పెంచాలంటే కేంద్ర ప్రభుత్వం పై టిఆర్ఎస్ ఢిల్లీలో ధర్నా చేపట్టాలని, బీసీలకు టిఆర్ఎస్ పై ప్రేమ ఉంటే కులగణలో పాల్గొనని కేసీఆర్, కనీసం దిల్లీలో అయినా దీక్ష చేయాలని జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు బీసీ రిజర్వేషన్లు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవ్ వర్మ గారికి పంపించిన ఆర్డినెన్స్ ను గవర్నర్ బీసీలపై సానుకూల దృక్పథం తో నిర్ణయం తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు దేశంలో మొదటిసారి ఓబీసీ రిజర్వేషన్ల అమలు చేస్తున్నట్టు ప్రకటించిన ఆగస్టు 7న గోవా రాష్ట్రం లో అఖిల భారత ఓబీసీ మహాసభను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నమని, ఈ మహాసభకు దేశంలోని 29 రాష్ట్రాల నుండి వేలాది మంది ఓబీసీ ప్రాజెక్టులో పాల్గొంటారని సభను విజయవంతం చేయాలని జాజుల శ్రీనివాస్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.

# నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సహాయం

ఎర్రగడ్డ.. మేజర్ న్యూస్.. బోరబండ డివిజన్ కి చెందిన ఇద్దరు నిరుపేద విద్యార్థులకు స్థానిక కార్పొరేటర్, నగర మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్ సతీమణి హబీబా సుల్తానా ఆర్థిక సహాయాన్ని అందజేశారు. తండ్రి లేని నిరుపేద ముస్లిం కుటుంబానికి చెందిన అఫన్ అహ్మద్, రోహన్ అహ్మద్ స్థానికంగా ఉన్న శ్రీ సరస్వతి హై స్కూల్ లో చదువుతున్నారు. ఈ మేరకు ఇద్దరు విద్యార్థులు ఫీజు కట్టలేని పరిస్థితిని తెలుసుకొని అభిబ సుల్తానా బుధవారం స్కూల్ ప్రిన్సిపాల్ కి 25 వేయిల విలువగల చెక్కును అందజేశారు.

# ప్రభంజన్ యాదవ్ మరణం బీసీ ఉద్యమానికి లోటు

## మన ఆలోచన సాధన సమితి అధ్యక్షుడు కటకం నర్సింగరావు



హైదరాబాద్ మేజర్ న్యూస్: ఆచార్య ప్రభంజన్ యాదవ్ అకాల మరణం తీవ్ర ఆవేదనకు గురి చేసిందని మన ఆలోచన సాధన సమితి (మాస్) అధ్యక్షులు కటకం నర్సింగరావు అన్నారు. ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్ మృతి పట్ల ఆయన ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్ సామాజిక ఉద్యమకారుడి స్ఫూర్తి, సామాజిక శాస్త్రవేత్తగా అధ్యయనదృక్పథం, పత్రికా రచయితగా పదబలాన్ని కలగలిపినదృఢమైన మానవతా దీక్ష కనిపించేదన్నారు. ఆరోగ్యం బాగా లేకున్నాను బీసీ ఉద్యమాన్ని ఆయన నడిపిన తీరు అందరికీ ఆదర్శనీయం అని కొనియాడారు. గత కాలంగా ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్ క్యాన్సర్ తో పోరాడుతూ తన జీవన పోరాటాన్ని ముగించిన ఆయన అస్తమయం ు తెలంగాణ సమాజానికి, బీసీ, బహుజన ఉద్యమాలకు తీరని నష్టం కలిగినట్లు అవుతుందన్నారు. ఆయన కలలుగన్న బహుజనల రాజ్యాధికారము సాధించుకున్నప్పుడే ఆయనకు మనం ఘనమైన నివాళి అర్పించిన వారు మవు తాము ఆయన ఆత్మ కు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు కటకం నర్సింగరావు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# హ్యాపీ బర్త్ డే



హయత్ నగర్, మేజర్ న్యూస్: మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కొడుకు సుశీ ఇన్ఫ్రాస్ట్రక్చర్ మరియు డెవలపర్ మైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఎండీ కోమటిరెడ్డి సంకీర్తరెడ్డి పుట్టినరోజు వేడుకలను చండూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోరిమి ఓంకారం, చండూర్ టౌన్ పార్టీ అధ్యక్షులు అనంత చంద్రశేఖర్ గౌడ్ సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కావలి ఆంజనేయులు, గంట సత్యం, దొటీ వెంకన్న, కలిమికొండ జనార్ధన్, నలగంటి మల్లేశం, రామ్మూర్తి, జనార్దన్, ధర్మేందర్, కృష్ణారెడ్డి, వేణు తదితరులు పాల్గొన్నారు.

# బాక్స్ డ్రైన్స్ నిర్మాణ పనుల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలి : ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

ఎల్బీనగర్, మేజర్ న్యూస్ ప్రతినిధి: బాక్స్ డ్రైన్స్ నిర్మాణ పనుల్లో అధికారులతో చర్చించి తగు జాగ్రత్తలు తీసుకునే విధంగా చూస్తానని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవీరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు.బుధవారం నాగోల్ డివిజన్ పరిధిలోని సౌత్ అండ్ పార్క్ కాలనీ కమ్యూనిటి హాల్ చుట్టుప్రక్కల కాలనీ(సౌత్ అండ్ పార్క్ కాలనీ,స్వాతి గార్డెన్స్ ,డీ.పీ.కాలనీ,హరిపూరి కాలనీ ,శైలజపూరి)కాలనీ అధ్యక్ష,కార్యవర్గ సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా పలువురు కాలనీ వాసులు మాట్లాడుతూ, బాక్స్ టైపు రెయిన్ వాటర్ నాలా పాత నాల నుంచి రైన్ వాటర్ పోవాలా లేదా కొత్త నాలా వేయాలా అనే దాని గురించి చర్చించారు. మీద నుంచి వచ్చే డ్రైన్స్ వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని అన్నారు. మాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నయ మార్గాలు చూడాలని కోరారు. దానిలో భాగంగా ఆ సమావేశం నుంచి స్థానిక జీహెచ్ఎంసీ అధికారి కి ఫోన్ చేసి ఆ కాలనీ వాసులచే పర్యటించి పరిశీలించి సరైన నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. దానికి అధికారులు మాట్లాడుతూ, కాలనీలో పర్యటించి నివేదిక అందిస్తామని



తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ భారస నాయకులు ఆనంతుల రాజిరెడ్డి, డివిజన్ అధ్యక్షులు తూర్పాటి చిరంజీవి,కత్తుల రాంబాబు ,భాస్కర్ యాదవ్,కాలనీ ప్రధాన కార్యదర్శి రవికుమార్, అధ్యక్షులు రమేష్ ,అజయ్, కిషోర్,మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కొంపల్లిలో వ్యాపార కేంద్రాల ట్రేడ్ లైసెన్సులు తనిఖీ చేసిన కమిషనర్



కొంపల్లి, మేజర్న్యూస్ః కొంపల్లి పట్టణంలోని వివిధ వర్తక, వ్యాపారాలకు సంబంధించిన ట్రేడ్ లైసెన్స్ లను బుధవారం కొంపల్లి మున్సిపాలిటీ కమిషనర్ ఎన్. కృష్ణా రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కొంపల్లిలో అన్ని వర్తక, వ్యాపార సంస్థల యజమానులు తమ వ్యాపారాలు ప్రారంభించే ముందు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే వ్యాపారాలు నడుపుతున్న వారు వెంటనే మున్సిపాలిటీ నుండి ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని, లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహిస్తే, చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కమిషనర్ కృష్ణారెడ్డి హెచ్చరించారు.

# ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యం : శంభీపూర్ క్రిష్ణ



దుండిగల్ మేజర్ న్యూస్ : ప్రతి కాలనీలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడమే తన లక్ష్యమని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ అన్నారు. బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవ ర్గం దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్ లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణని నియోజకవర్గానికి చెందిన తాజా మాజీ ప్రజాప్రతినిధిలు, కాలనీ సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు, పలువురు కలిశారు. వారు సానుకూలంగా స్పందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కె.పి వివేకానందల దృష్టికి తీసుకెళ్లి వారి సహాయ సహకారాలతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అదేవిధంగా బాహాదుర్ పల్లి ఇందిరమ్మ కాలనీలో ప్రజలు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.తాజా మాజీ కౌన్సిలర్లు మైసిగారి వెంకటేష్, శివనూరి మల్లేష్, కాలనీ ప్రజలు, మల్లంపేట మాజీ ఎంపీటీసీ, తాజా మాజీ కౌన్సిలర్ మాదాస్ వెంకటేశం పుట్టినరోజు పర్వదిన సందర్భంగా వారు శంభీపూర్ క్రిష్ణని కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# మల్కాజిగిరిలో రగలిన రాజకీయ చిచ్చు

## • నేతల పరస్పరదాడులు • భగ్గుమన్న రాజకీయ వేడి • సవాల్ ప్రతి సవాళ్ళతో...టెన్షన్ టెన్షన్








మల్కాజిగిరి, మేజర్ న్యూస్: బోనాల పండుగ సందర్భంగా ప్రతి సంవత్సరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్సవాల నిర్వహణ కోసం దేవాలయ కమిటీలకు అందజేస్తున్న చెక్కులు పంపిణీ కార్యక్రమం మల్కాజిగిరిలో వివాదస్పదంగా మారింది. అల్వాల్ లో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రభుత్వం విప్ బీర్ల అయిలయ్య ముఖ్య అతిథిగా హజరు కాగా, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు, వివిధ దేవాలయాల కమిటీ నిర్వాహకులు హజరైనారు. ప్రొటోకాల్ ఉల్లంఘన విషయాన్ని ప్రశ్నించడంతో ఇరు పార్టీలు నేతల మధ్య రగడ జరిగింది. మాట మాట పెరగడంతో కోపోద్రిక్తులైన నాయకులు గల్లాలు పట్టుకుని దూషించుకున్నారు. కులం పేరుతో తమను దూషించారంటూ కాంగ్రెస్ నాయకులు మరింతగా రెచ్చిపోయారు. మహిళలు సైతం నాయకులు గల్లా పట్టకుని నిలదీశారు. పొల్లు పొల్లున కొట్టుకున్నారు. పరస్పరం నాయకులు దాడిలో అల్వాల్ కు చెందిన కాంగ్రెస్ నేత లక్ష్మీకాంత్ రెడ్డి దుస్తులు చినిగి పోయాయి. అదే విధంగా గౌతంనగర్ డివిజన్ కార్పొరేటర్ భర్త మేకల రాము యాదవ్ పై విచక్షణారహితంగా దాడి జరిగింది. ఇదే క్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మల్కాజిగిరి మాజీ కార్పొరేటర్ ఎన్.జగదీష్ గౌడ్, జేఏసీ నేత వెంకన్న,
మండలి చిన్నా యాదవ్ లపైన దాడి జరిగింది. అడ్డుకోబోయిన మహిళ కార్పొరేటర్ లకు గాయాలైనాయి.

**సవాల్- ప్రతి సవాళ్ళతో మల్కాజిగిరిలో ఉద్రిక్తత ...** దాడుల దరిమిలా మల్కాజిగిరికి చెందిన బీఆర్ఎస్ నేతలు సంఘ సేవకుడు, తమ కుల పెద్ద మండలి రాథాకృష్ణా యాదవ్ ను సంప్రదించారు. తమ కుటుంబ సభ్యులు, తమ కుల సోదరులపై దాడి జరగడంతో మండల రాథాకృష్ణ యాదవ్ మంగళవారం రాత్రి, కాంగ్రెస్ నేత,మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుతో ఫోన్ లో మాట్లాడారు.అకారణంగా తమ వారిపై జరిగిన దాడి గురించి ప్రశ్నించారు. మల్కాజిగిరిలో దాడులు సంస్కృతిని సహించేది లేదన్నారు. ఈ క్రమంలో వారిరువురు నడుమ మాట మాట పెరిగింది. మల్కాజిగిరికి రా...చూసుకుందాం...అంటూ రాథా యాదవ్ సవాల్ విసిరారు. ఇప్పుడే మల్కాజిగిరి చౌరస్తాకు నేను వస్తున్న...అక్కడే ఉండు తేల్చుకుందాం...అంటూ మైనంపల్లి ప్రతి సవాల్ చేశారు.

**మల్కాజిగిరి చౌరస్తాలో...టెన్షన్ టెన్షన్..** సవాల్ విసిరిన అరగంట లోపే మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు,తన కుమారుడు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ లు వందలాది మంది అనుచరులతో
మల్కాజిగిరి చౌరస్తాకు చేరుకున్నారు. ఎవరు వస్తారో రండిరా...అంటూ.. మైనంపల్లి కుర్చీ వేసుకుని కూర్చున్నారు. ఆయన కుమారుడు మైనంపల్లి రోహిత్ కారు మీద కూర్చొని వేచి ఉన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి, మైనంపల్లి జిందాబాద్ అంటూ నినాదాలు చేయడంతో ఒక్కసారిగా మల్కాజిగిరి చౌరస్తా దద్దరిల్లింది. ఒక్కసారిగా వాతావరణం హీట్ ఎక్కడంతో భారీగా పోలీసులు ఇక్కడికి చేరుకున్నారు. అర్ధ గంటకు పైగా మల్కాజిగిరి చౌరస్తాలో ఖుర్చీ వేసుకుని కూర్చొన్నా ఎవ్వరూ రాలేదు. దీంతో ముందు జాగ్రత్తగా మల్కాజిగిరి పోలీసులు మైనంపల్లికి నచ్చ చెప్పడంతో ఆయన శాంతించి, తన అనుచరులను తీసుకుని ఆనంద్ బాగ్ క్యాంపు కార్యాలయానికి వెళ్ళారు. వందలాది మంది అనుచరులతో మైనంపల్లి హన్మంతరావు తన క్యాంపు కార్యాలయంలో తిష్ట వేయడంతో మల్కాజిగిరిలో టెన్షన్ వాతావరణం ఏర్పడింది.

**మండలి రాథా...ఎంట్రీ...** ముందస్తుగా హౌజ్ అరెస్ట్ లో ఉన్న మండలి రాథా యాదవ్
పోలీసుల అనుమతితో మల్కాజిగిరి చౌరస్తా చేరుకున్నారు. వందలాది మంది ఆయన అనుచరులు, కుల సంఘం నాయకులు, బంధుమిత్రుగణం,బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, బాధితులు, కార్పోరేటర్ ఆయనకు మద్దతుగా రావడంతో , అనుచరులు బిగ్గరగా నినాదాలు చేయడంతో మల్కాజిగిరి చౌరస్తాలో మళ్ళీ ఉద్రిక్తత ఏర్పడింది. అర్ధరాత్రి వరకూబిక్కుబిక్కుమంటూ మల్కాజిగిరి చౌరస్తా పోలీసు పహారాలో ఉండటం గమనార్హం.

**దాడులు చేయడం మంచి పద్దతి కాదు: మండలి రాథాకృష్ణ యాదవ్...** మల్కాజిగిరిలో పదే పదే నాయకులపై దాడులు చేయడం మంచి పద్దతి కాదని, ఈ పద్దతి మానుకొని ప్రజలకు సేవ చేసి మంచి పేరు తెచ్చుకోవాలని సంఘ సేవకుడు మండలి రాథాకృష్ణ యాదవ్, మైనంపల్లి హన్మంతరావుకు సూచించారు. పద్దతి మార్చుకోక పోతే, ఖబడ్దార్ మైనంపల్లి, ఇక జన్మలో నువ్వు మల్కాజిగిరిలో ఎమ్మెల్యేగా గెలవ లేవని హెచ్చరించారు.

**పథకం ప్రకారమే మాపై దాడి: మేకల రాము యాదవ్..** బోనాల చెక్ ల పంపిణీలో ఓ పథకం ప్రకారమే రాద్ధాంతం చేసి తమపై పథకం ప్రకారమే మాపై దాడి చేశారని బాధితుడు, గౌతం నగర్
కార్పోరేటర్ భర్త మేకల రాము యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడులు సంస్కృతి మల్కాజిగిరిలో ఏనాడూ లేదని , గత 5,6 ఏళ్ళుగా ఆయన వచ్చినాకే మొదలైందన్నారు. మల్కాజిగిరిలో రౌడీయిజం చేస్తే ఇక ముందు తాము సహించేది లేదని, తాము ఎదురు దాడికి సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు.

**దాడి గర్హనీయం కార్పోరేటర్ సునీత శేఖర్ యాదవ్..** బీసీ నాయకులైన మేకల రాము యాదవ్ , జగదీష్ గౌడ్, మండలి చిన్నా యాదవ్ లపై జరిగిన దాడి గర్హనీయమని మౌలాలి కార్పోరేటర్ దాడి గర్హనీయం కార్పోరేటర్ గున్నాల సునీత శేఖర్ యాదవ్ అన్నారు. తమ పార్టీలు వేరైనా బిసీ నేతలపై జరిగిన దాడిని ఖండిస్తున్నానని ఆమె అన్నారు.ఇది బీసీల మీద అగ్ర వర్ణాల వారు చేసిన దాడి అని, మల్కాజిగిరిలో గత 5 ఏళ్ళుగా వరుసగా రాజకీయ దాడులు జరుగుతున్నాయని ఇది హేయమైన చర్య అని ఆమె అన్నారు

## అల్లాపూర్ డివిజన్ అభివృద్ధికి కృషి : సబ్దార్‌నగర్ ఇ బ్లాక్‌లో పర్యటించిన కార్పొరేటర్ సబిహాబేగం

అల్లాపూర్, మేజర్‌న్యూస్ : అల్లాపూర్ డివిజన్ అభివృద్దే ధ్యేయంగా పని చేస్తున్నానని, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహాయ సహకారంతో కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధిపనులు చేసామని ఆమె అన్నారు. బుధవారం ఆమె సబ్దార్‌నగర్ ఇ బ్లాక్‌లో కార్పొరేటర్‌తో పాటు మైనారిటీసెల్ అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్, ఇంజనీరింగ్ అధికారులతో ఆమె ఇ బ్లాక్‌లో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇ బ్లాక్‌లో రోడ్లు, భూగర్భడ్రైనేజీ వ్యవస్థ అత్యవసరమని గుర్తించి సంబంధిత అధికారులు ఇంజనీరింగ్ శాఖ ఎఇ రంజిత్, జలమండలి శాఖ మేనేజర్ సయ్యు జాకిలతో ఆమె పరిశీలించారు. త్వరలోనే భూగర్భ డ్రైనేజీ, రోడ్లు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.



## నారాయణ చెరువులో కాలు జారి వ్యక్తి మృతి



కొంపల్లి, మేజర్‌న్యూస్ః చెరువులో కాలు జారిపడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం పేట్‌బషీరాబాద్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ విజయ్ వర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం గుండ్లపోచంపల్లిలో నివాసముండే దొడ్ల మల్లేష్(54) అనే వ్యక్తి మద్యం మత్తులో బుధవారం నారాయణ చెరువులో ప్రమాదవశాత్తు కాలు జారిపడిపోయి మృతిచెందడం జరిగిందని తెలిపారు. మృతుడికి ఇద్దరు భార్యలు ఉన్నారని, మద్యానికి బానిస కావడంతో వారు ఇరువురు మృతుడు మల్లేష్‌కు దూరంగా నివసిస్తున్నారని తెలిపారు. మృతుడి సోదరి కరకపట్ల లక్ష్మీబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు సీఐ తెలిపారు.

సూర్య
www.suryaa.com



# అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టిక ఆహారం చిన్నారులకు ప్లేట్లు, గ్లాసులు పింపిణీ

## డాక్టర్ పి.వి రవిశేఖర్‌రెడ్డి



అల్లాపూర్, మేజర్‌న్యూస్ : వెంగళరావునగర్ డివిజన్ వీడియోగల్లీలోని అంగన్వాడీ కేంద్రాన్ని రాష్ట్ర యువజన కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిధి డాక్టర్ పివి రవిశేఖర్‌రెడ్డి బుధవారం సందర్శించారు. అక్కడ 0-6 సంవత్సరాల వయస్సుగల పిల్లలకు పాలు, పండ్లు, తదితర న్యూట్రీషియన్ ఫుడ్స్ అందుతున్న తీరును పరిశీలించారు. ప్రతి పిల్లవాడికి పౌష్టిక ఆహారం చేరేలా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. అక్కడ పిల్లలకు సరైన ప్లేట్లు లేవని తెలిసి వెంటనే తన స్వంత ఖర్చులతో వెంటనే స్టీల్‌ప్లేట్స్ తెప్పించి చిన్నారులకు అందజేశారు. బిస్కట్లు పంపిణీ చేసారు. ఫ్యాన్లు లేవని తెలియడంతో తన స్వంత ఖర్చులతో ఫ్యాన్లు వేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన టీచర్లతో మాట్లాడి పిల్లలను ఆరోగ్యవంతంగా చూడాలని కోరారు. అలాగే మెరుగైన విద్యాభోధనలు అందించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ సేవకులు మాచర్ల పీటర్‌పాల్, టీచర్ ఎం. వేదావతి, కాంగ్రెస్ నాయకులు కుమారి, అల్బర్ట్ ఖురేషి, గురునాథరావు, భరత్ కుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రత పాటిద్దాం... కాలనీలను పరిశుభ్రంగా ఉంచుకుందాం

## కార్పోరేటర్ మొద్దు లచ్చిరెడ్డి



వనస్థలిపురం,మేజర్‌న్యూస్ఃపరిసరాల పరిశుభ్రత ఎంతో ముఖ్యమని అందుకోసం ప్రతి ఒక్కరు తమ ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బిఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పోరేటర్ మొద్దు లచ్చిరెడ్డి సూచించారు. కాలనీల వాసులు ప్రతి ఒక్కరు చెత్తను చెత్త రిక్షాకే వేయాలని వీదుల్లో చెత్త వేయవద్దని కోరారు. పారిశుద్య కార్మికులు ఎప్పటికపుడు వీదుల్లో చెత్తను తీసి వేయాలని సూచించారు. బిఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని శ్రీపురం కాలనీ వాసుల కోరిక మేరకు కార్పోరేటర్ బుధవారం కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో ఉన్న పారిశుద్య కార్మికులను ఉద్దేశించి కాలనీలలో ఏర్పడే చెత్తను ఎప్పటికపుడు తొలగించాలని, ప్రధాన రహదారులే కాకుండా లోపలున్న వీధుల్లో కూడా చెత్తను తొలగించి కాలనీ వాసులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు పలు సమస్యలను కార్పోరేటర్ దృష్టికి తీసుకురావడంతో వీలైనంత త్వరలో సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పద్మారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ముత్యంరావు, చంద్రయ్య, నారాయణరెడ్డి, విఠల్‌రెడ్డి, సికిందర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, పురుషోత్తమ్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ మహంకాళీ అమ్మ వారి బోనాల ఉత్సవాలకు రండి

## బిజెపి అధ్యక్షులు రామచంద్రరావుకు ఆహ్వాన పత్రిక అందజేసిన నీళ్ల అంజన్‌కుమార్‌గౌడ్

వనస్థలిపురం,మేజర్‌న్యూస్ఃవనస్థలిపురంలోని శ్రీ మహంకాళి అమ్మ వారి బోనాల ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతు ఆలయ కమిటి చైర్మన్ నీళ్ల అంజన్‌కుమార్‌గౌడ్ బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావును కోరారు. ఈ మేరకు ఈనెల 20వ తేదీన జరుగనున్న బోనాల ఉత్సవ ఆహ్వాన పత్రికను అందజేశారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు నెలువైన బోనాల ఉత్సవాలను వనస్థలిపురం కాంప్లెక్స్ వద్ద ఉన్న శ్రీ మహంకాళీ ఆలయంలో ఘనంగా నిర్వహిస్తున్నామని, బోనాల ఉత్సవంతో పాటు పలహారపు బండి ఊరేగింపు కార్యక్రమం అంగరంగ వైభవంగా జరుగుతుందని ఈ ఉత్సవానికి హాజరు కావాలని ఈ సందర్భంగా అంజన్‌కుమార్‌గౌడ్ రామచంద్రరావును కోరారు.



# బోనాల వేడుకల్లో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



హయత్ నగర్, మేజర్ న్యూస్: ఎల్.బి.నగర్ నియోజకవర్గం మనసురాబాద్ లో బుధవారం నిర్వహించిన బోనాల వేడుకలు ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి హాజరయ్యారు. ఏటా మన్సూరాబాద్ గ్రామ కుమ్మర్లు అమ్మవారికి సమర్పించే తొలి బోనం జాతరలో ఆయన పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మన డివిజన్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, మాజీ అధ్యక్షులు పోచబోయిన జగదీష్ యాదవ్, టంగుటూరి నాగరాజు, విజయభాస్కర్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.



# కరెంటు సమస్యలకు పరిష్కారం



హయత్ నగర్, మేజర్ న్యూస్: మన్సూరాబాద్ డివిజన్ హయత్ నగర్ లోని లెక్చరర్స్ కాలనీలో విద్యుత్ వినియోగదరులకు ఎలాంటి అంతరాయం కలగకుండా ట్రాన్స్ఫార్మర్ పైనున్న 3ఫేస్ లలో లోడ్ హెచ్చుతగ్గులు లేకుండా సమంతరంగా డివైడ్ చేశారు. అలాగే డివిజన్లోని వివిధ కాలనీలలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండే విధంగా శ్రద్దవహిస్తున్న ఎలక్ట్రికల్ ఏఈ ఖాద్రి, సిబ్బందిని స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి అభినందించారు. ఇంకా డివిజన్లోని వివిధ కాలనీలలో కరెంట్ సమస్యలను వెంటనే మా దృష్టికి లేదా ఎలక్ట్రిసిటీ అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో లైన్ మెన్ యాదయ్య, బలరాం, బిజెపి నాయకులు కడారి యాదగిరి, ప్రమోద్ రెడ్డి, వెంకటరమణ గౌడ్, గుండు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# అవినీతిపై కవితల అస్త్రం



వనస్థలిపురం,మేజర్‌న్యూస్ఃఅవినీతి అనేది సర్వత్రా వ్యాపించిందని, దానిపై కవులు కవితల అస్త్రాన్ని ప్రయోగించాల్సిన అవసరం ఉందని డా. వంశీ రామరాజు ఉద్ఘోదించారు. గత మంగళవారం రాత్రి హైదరాబాద్ మోహన్‌నగర్ కొసరాజు ఆర్తి అండ్ జాహ్నవి మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో సాహితీకిరణం సదరు ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహించిన అంతా అవినీతి మయం - అంతం చేయాలి మనమిక ' అనే అంశంపై నిర్వహించిన కవి సమ్మేళనానికి ముఖ్య అతిధిగా విచ్చేసి వారు ప్రసంగించారు. ఈ రోజుల్లో చిన్నపిల్లల్ని ఏదైనా మాట అంటే వారు ఎదురుతిరుగుతున్నారని, అటువంటప్పుడు అవినీతిపరులను మనం గట్టిగా అనలేని పరిస్థితి ఉన్నది కాబట్టి కవులే తమ కవితల ద్వారా ఈ అంశాన్ని ప్రజల మధ్యకి తీసుకెళ్లాలని కోరారు. ఈ కవి సమ్మేళనం ప్రారంభకులుగా తొలుత కవిత చదివిన సాహితీకిరణం సంపాదకులు పొత్తూరి సుబ్బారావు నేడు విజృంభిస్తున్న కార్పోరేట్ శక్తులు దేశాన్ని ఏ విధంగా అవినీతి మయం చేశాయనేది తన కవిత రుతువులేని క్రతువు లో తెలియజేశారు. పెద్దూరి వెంకటదాసు నిర్వహించిన ఈ కవి సమ్మేళనంలో ఇంకా పొత్తూరి జయలక్ష్మి, తంగిరాల చక్రవర్తి, జొన్నలగడ్డ శ్యామల, ఎన్వీ రఘువీరప్రతాప్, యం. అరుణకుమారి, వరిమి వెంకటసత్యమూర్తి, మల్లాది విజయలక్ష్మి, డా. పి. అంజన్‌కుమార్, తుమ్మ జనార్దన్, గూడూరు విజయలక్ష్మి, ఆచంట సుధాకర్, గడ్డం సులోచన తదితరులు చదివి వినిపించిన కవితలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు కొసరాజు సామ్రాజ్యం తాను ఈ కవి సమ్మేళనాన్ని ఏర్పాటు చేయడానికి గల కారణాలను వివరిస్తూ ఒక కవితను కూడా చదివి వినిపించారు. కార్యక్రమంలో కొసరాజు రాజేంద్రప్రసాద్ పాల్గొనగా మల్లాది వెంకటరమణ తన సహకారాన్నందించారు.

# టన్నెలింగ్ పనులు పరిశీలించిన కార్పొరేటర్



హయత్ నగర్, మేజర్ న్యూస్: మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని ఆగమయ్య నగర్ కాలనీలో నెలకొన్న మౌలిక సదుపాయాల లోపాలను దృష్టిలో పెట్టుకుని, లోతట్టు ప్రాంతమైన ఈ కాలనీలో వర్షపు నీరు నిలవకుండా ఉండేందుకు వ్యవస్థను అభివృద్ధి చేయడం కోసం టన్నెలింగ్ పనులు విజయవాడ నేషనల్ హైవే రోడ్డు అవతల నుండి ఇవతల వైపు వరకు చేపట్టి కే ఎల్ ఎం వద్ద బాక్స్ నాలాకు సరైన లెవెల్స్ తో కలపడం జరుగుతుంది. బుధవారం ఆయా పనుల పురోగతిని జిహెచ్ఎం డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మనసురాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి కాలనీ వాసులతో కలిసి సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులు వేగంగా పూర్తి చేయాలంటూ సూచనలు చేశారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మన డివిజన్‌లో అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం కోసం నిరంతరంగా కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్, కాలనీ అధ్యక్షులు యాదయ్య శ్రీరాములు, ఆంజనేయులు, వసుధ, సుజాత, వెంకట్రామిరెడ్డి, వెంకట చారీ, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.